రోడ్డుపైనే వసతి.. సర్వజన దుస్థితి

కర్నూలు సర్వజన ఆసుపత్రిలోని ప్రసూతి విభాగానికి నిత్యం వందలాది మంది గర్భిణులు వైద్యం, ప్రసవం కోసం వస్తుంటారు. వారికి సహాయంగా కుటుంబ సభ్యులు, బంధువులు వస్తుంటారు. గర్భిణులకు ప్రసవం చేశాక మూడు నుంచి వారం రోజులు ఉండాల్సి వస్తోంది. బాలింతలు, నవజాత శిశువులకు అనారోగ్య సమస్యలుంటే మరికొన్ని రోజులు ఇక్కడే ఉండి చికిత్స పొందాలి. వారికి సహాయంగా వచ్చినవారు ఇక్కడ ఉండేందుకు వసతి లేక అవస్థలు పడుతున్నారు. పగలు చెట్ల నీడలో పడిగాపులు కాస్తున్నారు. రాత్రివేళలో రోడ్డుపైనే నిద్రిస్తున్నారు. ఓవైపు దోమల బెడద.. మరోవైపు కుక్కలు, పందుల భయంతో రాత్రంతా జాగారం చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. – ఈనాడు, కర్నూలు

ఆన్‌లైన్‌లో మెరిట్ జాబితా

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : వయో వృద్ధులు, దివ్యాంగుల శాఖ పరిధిలో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ జాబితాను kurnool.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు సహాయ సంచాలకులు రయీస్ ఫాతిమా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని దరఖాస్తుదారులు గమనించాలన్నారు.

కోనేటిరాయుడికి వృశ్చికాభిషేకం

కోడుమూరులోని కొండ్రాయి కొండపై వెలసిన శ్రీవేంకటేశ్వస్వామికి సోమవారం తేళ్లతో అభిషేకం చేశారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.
– న్యూస్‌టుడే, కోడుమూరు గ్రామీణ

తడకనపల్లి గ్రామ పంచాయతీలో పోలింగ్ కేంద్రాల తుది జాబితా విడుదల చేస్తున్న పంచాయతీ కార్యదర్శి

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేసింది. పల్లె పోరుకు సంబంధించి తొలి దశలో పోలింగ్ కేంద్రాల తుది జాబితాను సోమవారం విడుదల చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 10,340 పోలింగ్ కేంద్రాలున్నాయి. అన్ని గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, ప్రధాన కేంద్రాల్లో కలెక్టర్ సంతకాలతో కూడిన అధికారిక తుది జాబితాలను పంచాయతీ కార్యదర్శులు ప్రదర్శిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 10,340 పోలింగ్ కేంద్రాలు

7న కులాల వారీగా ఓటరు జాబితా ప్రచురణ

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 23,34,617 మంది పల్లె ఓటర్లు ఉన్నారు. కర్నూలు జిల్లాలో 12,50,036, నంద్యాల జిల్లాలో 10,84,581 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్లను గుర్తించేందుకు పంచాయతీ కార్యదర్శులు ఇంటింటి సర్వే నిర్వహించారు. సెప్టెంబరు 3న గ్రామసభలు నిర్వహించి ఓటర్ల నమోదుపై అభ్యంతరాలు స్వీకరించి కలెక్టర్‌కు నివేదిస్తారు. 7వ తేదీన ప్రతి పంచాయతీలో పోలింగ్ కేంద్రాల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర కులాల వారీగా తుది ఓటరు జాబితాలను ప్రచురించనున్నారు. ఈమేరకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.
– న్యూస్‌టుడే, కర్నూలు జడ్పీ

సాగని పనులు.. ఎగరని డ్రోన్లు

• కానరాని మౌలిక వసతులు

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డ్రోన్ సిటీ పనులు ఆశించినస్థాయిలో ముందుకు సాగడం లేదు. ఓర్వకల్లు మండలం కొమరోలు గ్రామ పరిధిలో 600 ఎకరాల విస్తీర్ణంలో డ్రోన్ సిటీ నిర్మాణానికి వీలుగా ఏపీఐఐసీ అధికారులు భారీ లేఅవుట్ అభివృద్ధి చేస్తున్నారు. కాగా ఇప్పటివరకు నీరు, విద్యుత్తు, రహదారుల సదుపాయాలు అందుబాటులో లేవు. గత నెల 18వ తేదీన సీఈవోల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అధికారులు హడావుడిగా కొన్ని రహదారులు నిర్మించారు. వీటిపై తారు వేయలేదు.
ఈనాడు, కర్నూలు,
– న్యూస్‌టుడే, ఓర్వకల్లు

రూ. 500 కోట్లు కేటాయించినా..

● డ్రోన్ సిటీని ప్రపంచ స్థాయిలోనే అధునాతనంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఏపీలో డ్రోన్ రంగాన్ని గణనీయంగా అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో 2024-29 మధ్య రూ.500 కోట్లు వెచ్చించాలని నిర్ణయించింది. అంత భారీ మొత్తం డ్రోన్ల రంగానికి ప్రభుత్వం కేటాయించినా అధికారులు మాత్రం ఆయా నిధులను ఉపయోగించుకోవడంలో విఫలమవుతున్నారు.

● డ్రోన్ సిటీకి ఉపయుక్తంగా ఉంటుందన్న ఉద్దేశంతో ఉప్పలపాడు వైపు నుంచి ఒక రహదారిని సుమారు రూ.4 కోట్లతో నిర్మించారు. ఆ తర్వాత అది ప్రస్తుతానికి ఉపయుక్తంగా లేదని మరో రోడ్డు నిర్మించడం గమనార్హం.

డ్రోన్ సిటీ విస్తీర్ణం :	600 ఎకరాలు
ఇప్పటివరకు అభివృద్ధి చేసింది :	118.29 ఎకరాలు
అందుబాటులోకి తెచ్చిన ప్లాట్ల సంఖ్య :	15
కేటాయించిన ప్లాట్ల సంఖ్య :	8

లక్ష్యానికి ఆమడదూరంలో..

రాష్ట్రంలో కనీసం వంద డ్రోన్ సంస్థలు ఏర్పాటయ్యేలా చూడాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. డ్రోన్ సిటీని తెరపైకి తెచ్చింది. ఇందులో సంస్థలు ఏర్పాటు చేసుకునేవారికి పలు రాయితీలు ఇవ్వడంతోపాటు వివిధ వెసులుబాట్లు కల్పించింది. డ్రోన్ సిటీలోనే అన్ని సంస్థలు వినియోగించుకునేలా పరిశోధన కేంద్రాలు, టెస్టింగ్ ట్రాక్‌లు, డ్రోన్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థలను ఏర్పాటు చేస్తోంది. దీంతోపాటు డ్రోన్ కంపెనీలు తమ ఉత్పత్తులను పరీక్షించుకొనేందుకు, విక్రయించుకోవడం, ఎగుమతులు చేసేందుకు అవసరమైన అన్నిరకాల అనుమతులు కూడా డ్రోన్ సిటీలోనే ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తోంది. కాగా అత్యంత కీలకమైన ఆయా వ్యవస్థలు అందుబాటులోకి రాకపోవడంతో పెట్టుబడులు పెట్టాలనుకున్న వారికి నిరీక్షణ తప్పడంలేదు. వంద డ్రోన్ సంస్థలను ఏర్పాటు చేయించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నా ఇప్పటివరకు కొన్ని సంస్థలు మాత్రమే ముందుకు వచ్చాయి.

అనుమతులకు ఎదురుచూపులే..

డ్రోన్ సిటీలో సుమారు ఎనిమిది మందికి భూములు కేటాయించారు. వారిలో కొందరు పరిశ్రమ పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ నేటివరకు ఏపీఐఐసీ అధికారులు అనుమతులు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారు. మౌలిక సదుపాయాలు కల్పించిన తర్వాతే నిర్మాణాలు మొదలుపెట్టాలని చెబుతుండటంతో పారిశ్రామికవేత్తలకు ఏమి చేయాలో పాలుపోవడంలేదు.

సరకు తీసుకుని.. కాళ్లరిగేలా తిప్పించుకొని

• న్యాయం చేయాలని ఉల్లి రైతు వినతి

వినతిపత్రం చూపుతున్న తిరుమలేశు

ఈ చిత్రంలోని రైతు పేరు తిరుమలేశు. ఈయనది సి.బెళగల్ మండలం పల్దొడ్డి గ్రామం. ఆయన గతేడాది సెప్టెంబరు 20న కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో 106.56 క్వింటాళ్ల ఉల్లి విక్రయించారు. వ్యాపారి క్వింటా రూ.108 చొప్పున కొనుగోలు చేయగా.. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా వ్యత్యాస ధర కింద క్వింటాకు రూ.1,092 చొప్పున రూ.1,16,461 చెల్లించాల్సి ఉంది. ఉల్లిని విక్రయించి 11 నెలలైనా నగదు చెల్లించలేదు. మార్క్‌ఫెడ్ కేవలం రూ.11 వేలు మాత్రమే చెల్లించింది. ఇంకనూ సుమారు రూ.1.05 లక్షలు రావాల్సి ఉంది. ఉల్లిని విక్రయించిన నాటి నుంచి ఇప్పటివరకు 30సార్లు మార్క్‌ఫెడ్ అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయింది. కాళ్లరిగేలా తిరుగుతున్నానని.. తనకు న్యాయం చేయాలని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ డా.ఎ.సిరిని కలిసి వినతిపత్రం అందించారు. పదకొండు నెలలుగా కాలయాపన చేశారని చెప్పారు. తనలాంటివారు మరో పది మందికి పైగా ఉంటారని విన్నవించారు. దీనికి స్పందించిన కలెక్టర్ మార్క్‌ఫెడ్ డీఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే చెల్లింపులు చేయాలని ఆదేశించారు.
– న్యూస్‌టుడే, కర్నూలు కలెక్టరేట్

బరువు ఎత్తాడు.. పతకం పట్టాడు
జలధార పనుల్లో పురోగతి సాధించండి
6లో

దారి చూపండి.. కష్టం తీర్చండి



మండల పరిధిలోని పిల్లిగుండ్ల - బళ్లారి రహదారి పూర్తిగా రూపు కోల్పోయింది. సుమారు 10 కిలోమీటర్ల మేర ఉన్న రహదారి కంకర తేలి అధ్వానంగా మారింది. ఫలితంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డును దశాబ్దాల కిందట నిర్మించారు. అప్పటినుంచి మరమ్మతులు కరవయ్యాయి. గత వైకాపా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. జనం విన్నవించినా.. వినతిపత్రాలు అందజేసినా నిర్లక్ష్యం చేసింది. చివరికి రాళ్లు తేలి.. గుంతలమయమైన రహదారిపైనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. – న్యూస్‌టుడే, గోనెగండ్ల

ప్రమాదాలబారిన పడుతూ..

ఈ రహదారి మీదుగా గోనెగండ్ల, దేవనకొండ మండలాలకు చెందిన సుమారు తొమ్మిది గ్రామాల ప్రజలు నిత్యం అవస్థలు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. దారి పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు అదుపు తప్పి పడిపోతున్నారు. వాహనాలు సైతం పనికిరాకుండా పోతున్నాయి. రాత్రివేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. చాలామంది అదుపు తప్పి ఆస్పత్రుల పాలవుతున్నారు. కేవలం 10 కి.మీ. మార్గంలో ప్రయాణించాలంటే సుమారు 40 నిమిషాలు పడుతోందని వాహనదారులు పేర్కొంటున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి ఎనలేని ప్రాధాన్యమిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టేలా చూడాలని జనం విన్నవిస్తున్నారు.

మల్లన్నకు వెండి రథోత్సవం

శ్రీశైల మహాక్షేత్రంలో సోమవారం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల వెండి రథోత్సవం వైభవంగా జరిగింది. రాత్రి 7 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తులకు అర్చకులు సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. ఉత్సవ మూర్తులను వెండి రథంపై ఆశీనులు చేసి శివనామ స్మరణల మధ్య వైభవంగా జరిపారు.
–న్యూస్‌టుడే, శ్రీశైలం ఆలయం

తుంగభద్రకు తగ్గుతున్న వరద

హాలహర్వి, న్యూస్‌టుడే: తుంగభద్ర జలాశయం ఎగువన వర్షాలు పడటం ఆగిపోవడంతో వరద ప్రవాహం సైతం తగ్గుముఖం పట్టిందని టీబీ డ్యాం బోర్డు అధికారులు తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటల సమయానికి 8,416 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పేర్కొన్నారు.

ప్రహ్లాదరాయలుకు మహా ఉత్సవం

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా సోమవారం మహా రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. మూల బృందావనాన్ని స్వర్ణ కవచాలతో విశేషంగా అలంకరించి పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు మహా మంగళహారతి ఇచ్చారు. ప్రహ్లాదరాయలుకు ఊంజల్ సేవ చేసి వసంతోత్సవం జరిపారు. అనంతరం స్వామివారిని ఊరేగింపుగా తీసుకొచ్చి రథంలో ఆశీనులు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం అశేష భక్తజన సందోహం నడుమ మహా రథోత్సవం కనుల పండువగా సాగింది. లక్షలాది మంది ప్రత్యక్షంగా వీక్షించి మొక్కులు తీర్చుకున్నారు.
– న్యూస్‌టుడే, మంత్రాలయం, మంత్రాలయం గ్రామీణం

మూల బృందావనానికి హారతి ఇస్తున్న పీఠాధిపతి

రథం వద్దకు ఊరేగింపుగా వస్తున్న ఉత్సవమూర్తి

తేరుపై డ్రోన్‌తో పూల వర్షం

జనరిక్తహస్తం

• ఔషధ కేంద్రాల ఏర్పాటులో వెనుకబాటు

సర్వజన వైద్యశాలలోని జనరిక్ కేంద్రం

ఏటా పెరిగిపోతున్న ఔషధాల ధరలు.. పేదల జేబులను ఖాళీ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం జనరిక్ మందులను అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. ప్రధానమంత్రి భారతీయ జనరిక్ ఔషధి ప్రయోజన్ పేరుతో 723 రకాల మందుల ధరలు తగ్గిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం 2015లో అన్న సంజీవని దుకాణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ దుకాణాల ఏర్పాటులో అధికారులు వెనుకబడ్డారు. ప్రస్తుతం 29 జనఔషధి దుకాణాలు మాత్రమే ఉన్నాయి.
– న్యూస్‌టుడే, కర్నూలు వైద్యాలయం

బ్రాండు పేరుతో బాదుడు

జనరిక్ మందులు రాస్తే వైద్యులకు కమీషన్లు అందవు. అదే బ్రాండెడ్ ఔషధాలు రాస్తే నెలనెలా రూ.లక్షల్లో అందుతాయి. దీంతో వైద్యులెవరూ జనరిక్ మందులు రాయడం లేదు. పైగా జనరిక్ మందులు సరిగా పనిచేయవని చాలామంది దుష్ప్రచారం చేస్తుండటంతో రోగులు కూడా వాటిని కొనేందుకు వెనకాడుతున్నారు. పెద్దాసుపత్రుల్లో జనరిక్ దుకాణాలున్నా.. వాటిల్లో మందులు కొనుగోలు చేసేవారు 30 నుంచి 40 శాతం లోపే ఉంటున్నారు. ఈ ఔషధాల పనితీరుపై ప్రజలకు అవగాహన కల్పించడంపై అధికారులు దృష్టి పెట్టడం లేదు. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన జనరిక్ మందుల దుకాణాల్లో వ్యాపారం జరగక మూతపడ్డాయి.

ప్రభుత్వాసుపత్రుల్లోనే కొంత ఆదరణ

నగరంలోని సర్వజన వైద్యశాలలో 3, వివిధ కాలనీల్లో 4 కేంద్రాలున్నాయి. ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, పెద్దహరివాణం, నంద్యాల, డోన్, ఆత్మకూరు, ఆళ్లగడ్డ, నందికొట్కూరులో మాత్రమే ఏర్పాటు చేశారు. వీటిలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్నవే నడుస్తున్నాయి.

ఆసక్తి ఉంటే మంజూరు

స్వయం సహాయక సంఘాల్లో సభ్యులైన మహిళలు జనరిక్ మందుల దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చు. సదరు సభ్యురాలు కొనసాగుతున్న సంఘానికి సంబంధించిన సమాఖ్య తీర్మానం చేస్తే దుకాణం ఏర్పాటుకు జిల్లా ఔషధ నియంత్రణాధికారి అనుమతిస్తారు. ఈ అనుమతితో పాటు కొటేషన్, విద్యార్హత ధ్రువపత్రాలతో స్త్రీనిధి విభాగం అధికారులను కలిసి దుకాణం ఏర్పాటుకు దరఖాస్తు సమర్పించాలి.

"దుకాణం ఏర్పాటు చేయాలనుకునే వారికి ప్రత్యేకంగా యాప్ ఉంది. అర్హులకు అనుమతి పత్రం ఇస్తారు. దీనిని ఔషధ నియంత్రణ పరిపాలన కార్యాలయంలో ఇస్తే అనుమతిస్తారు" అని ఔషధ నియంత్రణ పరిపాలనాధికారి హరిహరతేజ చెప్పారు.

పొలాల్లో నిర్మించి.. నిధులు పక్కదారి పట్టించి

అక్కడ ఎలాంటి వంక లేదు. కనీసం వాగు ఉన్న ఆనవాళ్లు కానరావు. ఆ ప్రాంతంలో కనీసం నీరు పారే పరిస్థితి కూడా లేదు. అయినా రూ.లక్షలు వెచ్చించి చెక్‌డ్యాం నిర్మించేశారు. పెద్దఎత్తున ప్రజాధనం వృథా చేశారు. ఈ నిర్మాణంతో ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. అవసరం లేకున్నా భారీగా ప్రభుత్వ నిధులు ఖర్చు చేసి నిర్మించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తుగ్గలి రైల్వేస్టేషన్ సమీపంలోని తుగ్గలి-పత్తికొండ రహదారిలో పదేళ్ల కిందట దీనిని నిర్మించారు.
– న్యూస్‌టుడే, పత్తికొండ

పర్యవేక్షణ కరవై..

చెక్‌డ్యాం నిర్మించేటప్పుడు ముందుగా అధికారులు స్థల పరిశీలన జరపాలి. అక్కడ వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయా? లేదా? అని చూడాలి. ఏ ప్రాంతంలో చెక్‌డ్యాం నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుందో చూసి అనుమతి మంజూరు చేయాలి. భూగర్భ జలాలు వృద్ధి చెందేలా ప్రణాళికలు రూపొందించాలి. కానీ ఇదేమీ లేకనే పొలాల్లో నిర్మించేసి నిధులను పక్కదారి పట్టించారు. అవసరమున్నచోట్ల నిర్మాణాలపై దృష్టి సారించాల్సిన అధికారులు అవేమీ పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరించారు. ఫలితంగా ఎందుకూ పనికిరాకుండా పోయింది.

కాసుల వేట.. వసతుల కొరత

• ప్రైవేటు స్థలంలోనే మార్కెట్ నిర్వహణ

ఆస్పరి కూరగాయల మార్కెట్‌లో విక్రయాలు

మండల పరిధిలోని ఆస్పరి, బిల్లేకల్లు మార్కెట్లు ఆయా గ్రామ పంచాయతీలకు రూ.లక్షల్లో ఆదాయం తెచ్చిపెడుతున్నాయి. అయినా కనీస సౌకర్యాలు కరవయ్యాయి. ఫలితంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పరి టమాట మార్కెట్‌కు గతంలో రాష్ట్రస్థాయిలో గుర్తింపు ఉండేది. ఇక్కడి నుంచి హైదరాబాద్, చెన్నై, బెంగళూరు తదితర నగరాలకు ఎగుమతి చేసేవారు. టమాట ధరలు అప్పుడప్పుడు పతనమవుతుండటంతో పలువురు ఇతర పంటలపై దృష్టి సారించారు. గత పదేళ్లుగా టమాటతోపాటు కూరగాయలను పండిస్తున్నారు.
– న్యూస్‌టుడే, ఆస్పరి

రూ. 2 కోట్లకుపైగా సమకూరినా..

బిల్లేకల్లు మార్కెట్‌కు నాబార్డు సహకారంతో పంచాయతీ నిధులతో ప్రహరీతోపాటు కూరగాయల షెడ్లు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఆస్పరి మార్కెట్‌కు సొంత స్థలం లేదు. ఏటా ప్రైవేటు స్థలంలోనే నిర్వహిస్తున్నారు. ఆస్పరి మార్కెట్‌కు ఎనిమిదేళ్లలో దాదాపు రూ. 2,85,37,250 ఆదాయం వచ్చింది. అయినప్పటికీ మార్కెట్‌కు ప్రత్యేక స్థలం లేకపోవడం గమనార్హం. ఏటా ప్రైవేటు స్థలాలకు అద్దెలు చెల్లించి నిర్వహించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. మరోవైపు ఆస్పరి, బిల్లేకల్లు మార్కెట్లను వేలంపాటల్లో దక్కించుకున్న గుత్తేదారులు నేటికీ పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించలేదని పంచాయతీ అధికారులు చెబుతున్నారు.

ట్రాఫిక్ సమస్యలతో అవస్థలు

కర్నూలు- బళ్లారి ప్రధాన రహదారి పక్కనే ఆస్పరి మార్కెట్ ఉంది. విపణికి వచ్చిన వ్యాపారులు, రైతులు తమ వాహనాలను రహదారి పక్కనే నిలుపుతున్నారు. ఈ మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. ఫలితంగా అప్పుడప్పుడు ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. ఒక్కోసారి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది.

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సిరి

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేకుండా అర్జీదారులు సంతృప్తి చెందేలా చూడాలని జిల్లా కలెక్టర్ డా.సిరి అధికారులను ఆదేశించారు. కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కలెక్టర్, జేసీ నూరుల్ ఖమర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీపై అధికారులు సత్వరంగా స్పందించి పరిష్కరించాలన్నారు. అర్జీదారులకు అందించే ఎండార్స్‌మెంట్‌లు స్పష్టంగా, పూర్తి వివరాలతో ఉండాలని చెప్పారు. డీఆర్వో వెంకటనారాయణమ్మ, ఉప కలెక్టర్లు అనురాధ, శివప్రసాదరెడ్డి, రామ సుబ్బయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉర్దూ వర్సిటీలో కొత్త కోర్సు ప్రారంభం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ వర్సిటీలో ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్త కోర్సు ప్రారంభించినట్లు వీసీ షావలిఖాన్ తెలిపారు. ఈ ఏడాది నుంచి ఎంబీఏలో హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కోర్సు పూర్తి చేస్తే ఆసుపత్రి నిర్వహణ, ఆరోగ్య సేవల పరిపాలన అంశాల్లో పరిజ్ఞానం లభిస్తుందన్నారు. ఏపీ ఐసెట్-26లో అర్హత సాధించినవారు కౌన్సెలింగ్ ద్వారా ఈ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చన్నారు.

పత్రం అందక.. హక్కులు దక్కక

• సీసీఆర్ కార్డుల పంపిణీలో తీవ్ర జాప్యం

పలువురు కౌలు రైతులు భూయజమానులకు ముందస్తు కౌలు చెల్లించి ఏటా పంటలు పండిస్తున్నారు. వీరికి నిబంధనల ప్రకారం పంట సాగుహక్కు పత్రం అందించాల్సి ఉంది. ఖరీఫ్ సీజన్ చివరి దశకు వచ్చినా చాలామందికి కార్డులు అందలేదు. ఫలితంగా ప్రభుత్వం నుంచి అందే ప్రయోజనాలు కోల్పోతున్నారు.– న్యూస్‌టుడే, కర్నూలు వ్యవసాయం

సమన్వయ లోపంతో..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో లక్ష మందికిపైగా కౌలుదారులున్నారు. ఏటా ఖరీఫ్ సీజన్ ఆరంభానికి ముందు ఏప్రిల్, మే నెలల్లో రెవెన్యూ, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించి కౌలుదారులను గుర్తించాలి. భూ యజమానులను ఒప్పించి కౌలుదారులకు సీసీఆర్ కార్డు అందించాల్సి ఉంది. దీని కాలపరిమితి 11 నెలలు మాత్రమే ఉంటుంది. ఈ రెండు శాఖల మధ్య సమన్వయం లోపించడంతో చాలామందికి కార్డులు అందలేదు.

2026–27 సంవత్సరానికి సీసీఆర్ కార్డుల లక్ష్యం, పంపిణీ వివరాలు

జిల్లా	లక్ష్యం	పంపిణీ చేసింది
కర్నూలు	30,000	13,879
నంద్యాల	25,000	17,497

పంట రుణమేదీ..

పంట సాగు హక్కు పత్రం (సీసీఆర్ కార్డు) ఉంటే బ్యాంకుల్లో ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.లక్ష వరకు పంట రుణం పొందే వీలుంది. కౌలు రైతులకు పంట రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు ముందుకు రావడం లేదు. కర్నూలు జిల్లాలో 30 వేల మంది కౌలుదారులకు సీసీఆర్ కార్డులు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు 13,879 మందికే అందజేశారు. పంట రుణాల విషయానికి వస్తే 62 మంది కౌలుదారులకు రూ. 65 లక్షల మేర పంట రుణాలు ఇచ్చినట్లు జిల్లా స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో ఎల్‌డీఎం వివరించారు. కర్నూలు జిల్లా పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.45 కోట్ల మేర పంట రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. నంద్యాల జిల్లాలో రూ.37.50 కోట్ల పంట రుణాలు ఇవ్వాలని లక్ష్యం కాగా 50 మందికి కనీసం రూ.50 లక్షలు కూడా ఇవ్వకపోవడం గమనార్హం.

ప్రయోజనాలు దూరం

సీసీఆర్ కార్డు ఉంటేనే పంటల బీమా ప్రీమియం చెల్లించేందుకు అవకాశం ఉంటుంది. కార్డులు అందకపోవడంతో పొలాలను కౌలుకు తీసుకొని పంటలు పండిస్తున్నా పంటల బీమా ప్రీమియం చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావంతో బెట్ట పరిస్థితులతో పంటలు ఎండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో పంటల బీమా చేయించుకోవాలని అధికారులు చెబుతున్నారు. కౌలుదారులకు కార్డులు అందక బీమా చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. రాయితీపై విత్తనాలు, ఎరువులు, పంట ఉత్పత్తులను మద్దతు ధరకు అమ్ముకోవడం తదితరాలన్నింటికీ ఈ-పంట నమోదు తప్పనిసరి చేశారు. సీసీఆర్ కార్డులు లేకపోవడంతో ఈ-పంట నమోదు చేయడం లేదని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు 99899 97628

(c) eenadu

కూరగాయల తోట.. సస్యరక్షణతోనే లాభాల పంట

సాగులో ఉన్న కాకర

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: ఎల్‌నినో నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలవైపు రైతులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. కూరగాయల పంటలకు సోకే తెగుళ్లతో దిగుబడి గణనీయంగా తగ్గుతుంది. వాటిని సమర్థంగా నివారిస్తే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని ఆళ్లగడ్డ ఏవో కిశోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

● **మొజాయిక్ తెగుళ్లు:** ఈ తెగులు సోకినప్పుడు ఆకులపై లేత ఆకుపచ్చ, ముదురు ఆకుపచ్చ లేదా పసుపు రంగు మచ్చలు చదరంగం గడుల(మొజాయిక్) మాదిరి ఏర్పడతాయి. ఆకులు ముడుచుకుపోయి, కాయలు వంకర్లు తిరుగుతాయి. దోస, పుచ్చ, కాకర, మిరప, టమాటా పంటలకు దోస మొజాయిక్ వైరస్ సోకుతుంది.

● **ఆకుముడత తెగుళ్లు:** ఆకుముడత వైరస్ మిరపలో అధికంగా ఉంటుంది. ఆకులు పైకి లేదా కిందకు ముడుచుకుపోవడం, గిడసబారడం, చిన్నగా మారి గుత్తులుగా మారుతాయి. మొక్క ఎదుగుదల పూర్తిగా ఆగిపోతుంది. టమాటాలో ఆకుముడత వైరస్‌తో ఆకుల అంచులు పసుపు రంగులోకి మారి పైకి ముడుచుకుంటాయి. దీనిని తెల్లదోమ వ్యాప్తి చేస్తుంది.

● **కీటకాల నియంత్రణ మందులు:** వైరస్ ఒకసారి మొక్కకు సోకిన తర్వాత పూర్తిగా తొలగించడం అసాధ్యం. 5 శాతం వేప గింజల కషాయం లేదా అజాడిరక్టిన్ 10000 పీపీఎం లీటరు నీటికి 2 మి.లీ చొప్పున పిచికారీ చేసి రసం పీల్చే పురుగులను మొదటి దశలో అరికట్టవచ్చు.

రైతేరాజు

యాజమాన్య పద్ధతులు: ● వైరస్ రహిత, ధ్రువీకరించిన నాణ్యమైన విత్తనాలను మాత్రమే వాడాలి. ● ఒకే రకమైన పంటలను వరుసగా వేయకూడదు. ఆరోగ్యవంతమైన నారును వాడుకోవాలి. నారుమళ్లను నెట్‌హౌస్‌లో పెంచితే మంచిది. ● టమాటా, వంగ, మిరప వంటి కూరగాయల నారును నాటే ముందు ఇమిడాక్లోప్రిడ్ 0.5 మి.లీ ఒక లీటరు నీరు కలిపిన ద్రావణంలో ముంచి నాటుకోవాలి. విత్తే ముందు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలి. ● జొన్న, సజ్జ లేదా మొక్కజొన్న వంటి ఎత్తైన పంటలను 2-3 వరుసల్లో పొలం చుట్టూ వేయడంతో రసం పీల్చే పురుగులు నేరుగా ప్రధాన కూరగాయ పంటపై పడకుండా అడ్డుగోడలా పనిచేస్తాయి. ● జిగురు అట్టలు వాడటంతో వైరస్ తెగుళ్లను వ్యాప్తి చేసే పురుగులను ప్రారంభంలోనే నాశనం చేయవచ్చు. ఎకరాకు కనీసం 15 నుంచి 20 జిగురు అట్టలను అమర్చాలి.

చెత్తమార్గం.. పాదచారులకు సంకటం

కర్నూలు నగరంలోని పాత ఈద్గా రైల్వే ట్రాక్ సమీపంలో పారిశుద్ధ్య సిబ్బంది మురుగు కాలువలోని చెత్త, వ్యర్థాలను తొలగించి రోడ్డుపైనే పడేశారు. ఈ ప్రాంతంలో రోడ్డుకు అటువైపు నూతన రైల్వే ట్రాక్ ఏర్పాటులో భాగంగా పిల్లర్ల నిర్మాణం సాగుతోంది. దీంతో వాహనాలను ఒకవైపే అనుమతిస్తున్నారు. వచ్చిపోయే వాహనాలతో ఈ రహదారిలో తీవ్ర రద్దీ ఉంటోంది. వందలాది వాహనాల మధ్య పాదచారులు వెళ్లాలంటే కష్టంగా ఉంది. దీనికితోడు రోడ్డుపై మురుగుతో కూడిన వ్యర్థాలను కుప్పగా వేయడంతో పాదచారులు ఇబ్బంది పడ్డారు. – న్యూస్‌టుడే, కర్నూలు కలెక్టరేట్

పారిన గంగ.. తీరిన బెంగ

బనగానపల్లి మండలంలోని ఎస్సార్బీసీ కాల్వలు జలకళను సంతరించుకున్నాయి. సోమవారం ఆయా గ్రామాల్లోని కాల్వలకు నీరు రావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గోరుకల్లు రిజర్వాయరు నుంచి అధికారులు నీరు వదలడంతో కాల్వలు నీటితో కళకళలాడుతున్నాయి. భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. – న్యూస్‌టుడే, బనగానపల్లి గ్రామీణం

సందేహాలు సమాధానాలు

? కంది పంట ప్రస్తుతం పూత దశలో ఉంది. అక్కడక్కడా పురుగు కనిపిస్తోంది. – రామసుబ్బారెడ్డి, పాతపాడు.

✓ దీన్ని మారుక మచ్చల పురుగు లేదా గూడు పురుగు అంటారు. నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1 గ్రా. లేదా థయోడికార్బ్ 1 గ్రా. లేదా నోవాల్యురాన్ 1.0 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. లేదా ల్యాండా సైహలోత్రిన్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి మందులు మార్చి వారం రోజుల కొకసారి పిచికారీ చేయాలి.
– డా.ధనలక్ష్మి, కేవీకే శాస్త్రవేత్త
- న్యూస్‌టుడే, బనగానపల్లి

స్వల్పకాలిక రకాల సాగుతో ధీమా

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: సెప్టెంబర్‌లో ఆలస్యంగా విత్తుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడినప్పుడు రైతులు ప్రాంతం, నేల స్వభావం, నీటి లభ్యతను అనుసరించి స్వల్పకాలిక పంటలను ఎంపిక చేసుకుని సాగు చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్రచౌదరి తెలిపారు. సాగు చేసుకోదగిన పంట రకాల వివరణ..

కంది రకాలు : సెప్టెంబర్‌లో స్వల్పకాలిక కంది రకాలను విత్తుకోవచ్చు. ఎన్‌బీపీ-25444, ఎల్‌ఆర్‌జీ-2144, టీఎస్-3ఆర్, ఎన్ఏపీఎం-88, పీఆర్‌జీ-176 రకాలు అనుకూలంగా ఉంటాయి. వీటి పంటకాలం సుమారు 120-130 రోజులు. సరైన యాజమాన్య పద్ధతులతో ఎకరాకు సుమారు 6-7 క్వింటాళ్ల దిగుబడి పొందవచ్చు.

తేలికపాటి నేలల్లో.. వచ్చే నెలలో తేలికపాటి నేలల్లో జొన్న, కొర్ర, సజ్జ, పెసర, అలసంద, మేత జొన్న, ఉలవలు సాగు చేసుకోవచ్చు.

■ **జొన్న:** నంద్యాల తెల్ల జొన్న.. పంట కాలం - 100 నుంచి 115 రోజులు, ఎకరాకు సుమారు 15 క్వింటాళ్ల దిగుబడి.

■ **పెసర:** ఎల్‌జీజీ-607 రకం - పంటకాలం 70 నుంచి 75 రోజులు, ఎకరాకు 8-9 క్వింటాళ్ల దిగుబడి.

■ **కొర్ర:** సూర్యనంది- 75 రోజులు, దిగుబడి ఎకరాకు 8-9 క్వింటాళ్లు

■ **సజ్జ:** ఏబీవీ-04 రకం. పంట కాలం సుమారు 86 రోజులు, ఎకరాకు 10-12 క్వింటాళ్ల దిగుబడి.

■ **బరువైన నల్లరేగడి నేలల్లో..** బరువైన నల్లరేగడి నేలల్లో ఆముదం, జొన్న, కొర్ర, పెసర, అలసంద, ఉలవలు సాగు చేసుకోవచ్చు.

■ **ఆముదం:** ఐసీహెచ్-5 రకం.. పంట కాలం సుమారు 90-150 రోజులు, ఎకరాకు సుమారు 10 క్వింటాళ్ల దిగుబడి.

■ **అలసంద:** టీపీటీసీ-29 రకం.. పంటకాలం సుమారు 90 రోజులు, ఎకరాకు సుమారు 10 క్వింటాళ్ల దిగుబడి. అదే విధంగా నేల పరిస్థితులు, వర్షపాతం, నీటి లభ్యత, స్థానిక వాతావరణ పరిస్థితులకు బట్టి ఇతర స్వల్పకాలిక జొన్న, కొర్ర, పెసర, ఉలవ రకాలను కూడా సాగు చేసుకోవచ్చు.

నిత్యం తాగునీటి వసతి కల్పిస్తాం

శ్రీనివాస సర్కిల్‌లో పనులను ప్రారంభిస్తున్న బీవీ జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పుర ప్రజలకు 24 గంటలు తాగునీటి వసతి కల్పిస్తామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఎమ్మిగనూరు పట్టణంలోని శ్రీనివాస సర్కిల్‌లో తాగునీటి పథకంలో భాగంగా రూ.157 కోట్లతో చేపట్టే పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ.. వైకాపా హయాంలో రివర్స్‌టెండర్ పేరుతో 10 పైసా నిధులు విడుదల చేయలేదని ధ్వజమెత్తారు. చేసిన పనులకు బకాయిలు చెల్లించకుండా వదిలేసిందన్నారు. వైకాపా నాయకులు రూ.వందల కోట్ల ఖర్చు పెట్టి నీటి పథకం నిర్మించడం అనవసరమని అనడం దారుణమన్నారు. పట్టణంలో ప్రతి ఇంటికి తాగునీటి వసతి, రోడ్లు, కాల్వలు, వీధి దీపాలు వంటి వసతులు కల్పించడమే లక్ష్యమన్నారు. పట్టణంలోని చేనేత వర్గాలకు టెక్స్‌టైల్ పార్కు నిర్మించి ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో మంజూరు చేయించామన్నారు. రాష్ట్రంలో రెండేళ్లలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో 90 శాతంపైగా నెరవేర్చిందన్నారు. రాబోయే రోజుల్లో ఎమ్మిగనూరు పట్టణాన్ని నందనవనంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్యశాఖ ఈఈ గురప్పయాదవ్, పురపాలక కమిషనర్ గంగిరెడ్డి, మార్కెట్‌యార్డు ఛైర్మన్ మల్లయ్య, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జస్టిస్ టి.మల్లికార్జునరావును మొక్క అందజేస్తున్న జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షుడు కె.కిషోర్‌కుమార్, తదితరులు

లోకాయుక్తను కలిసిన వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే: లోకాయుక్త జస్టిస్ టి.మల్లికార్జునరావును జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షుడు కె.కిషోర్‌కుమార్, సభ్యులు నారాయణరెడ్డి, నజీమాకౌసర్‌లు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక కార్యాలయంలో ఆయన్ను కలిసి మొక్క అందజేసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా వారు పలు అంశాలపై చర్చించారు.

ఎల్‌నినో ప్రభావం.. ఉల్లి యాజమాన్యం

చాగలమర్రి, న్యూస్‌టుడే: రైతులకు తక్కువ వ్యవధిలో మంచి ఆదాయాన్ని అందించే వాణిజ్య పంటల్లో ఉల్లిగడ్డ ప్రధానమైంది. ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడి ఉల్లిగడ్డ పగలడం, అకాలంగా పూత రాలడం, ఎండదెబ్బ తగలడం, తామర పురుగుల ఉద్ధృతి ఎక్కువ కావడం జరుగుతుంది. దీంతో పంటలను కాపాడుకోవడానికి వ్యూహాత్మక నీటి పొదుపు పద్ధతులు, సూక్ష్మ వాతావరణ నిర్వహణను అమలు చేయడం అత్యవసరమని ఉద్యానవన శాఖ అధికారి దస్తగిరి తెలిపారు.

● **మొలకెత్తడం:** ఎల్‌నినో పరిస్థితుల వల్ల అధిక ఉష్ణోగ్రతలు, తేమ కొరత ఏర్పడి మొలక శాతం తగ్గడం, నారు పెరుగుదల మందగించడం, మొక్కలు వాడిపోవడం, తామర పురుగుల ఉద్ధృతి పెరగడం వంటి సమస్యలు ఎదురవుతాయి. తీవ్రమైన వేడి గాలుల నుంచి లేత మొక్కలను రక్షించడానికి, 50 శాతం నీడనిచ్చే నెట్లతో కూడిన ఎత్తైన మడుల్లో నారును పెంచుకోవాలి.

● **సరైన సాంద్రత:** మొక్కల ఆకులు నీళ్లను త్వరగా కప్పివేసి, నీరు ఆవిరి కాకుండా తగ్గించేలా చూసేందుకు మొక్కల మధ్య తక్కువ దూరాన్ని పాటించాలి. వేడి వాతావరణంలో అధిక మోతాదులో నత్రజని వేయడం అరికట్టాలి.

● **గంధకం వాడకం:** గడ్డ గాటు, వ్యాపార నాణ్యత, నిల్వ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి ఎకరాకు 15-20 కిలోల గంధకాన్ని వేసుకోవాలి.

● **మొక్కలు స్థిరపడే దశ:** వర్షాలు లేక తేమ కొరత ఏర్పడుతుంది. దీంతో అధిక సంఖ్యలో మొలకలు చనిపోవడానికి దారితీస్తాయి. నేల ఉష్ణోగ్రతను తగ్గించడానికి, తేమను నిలుపుకోవడానికి, వరుసల మధ్య 5 సెం.మీ. ధాన్యం గడ్డిని, చెరుకు వ్యర్థాల మల్చ్‌ను వేసుకోవాలి.

● **శాఖీయ దశ:** ఉల్లిపాయల్లో వేరు పెరుగుదల పరిమితంగా ఉండి, ఆకుల ఉత్పత్తి కుంటుపడుతుంది. సూక్ష్మ పోషకాల మిశ్రమం 3 నుంచి 4 గ్రా. లీటరు నీటికి కలిపి నెలకు రెండు సార్లు పిచికారీ చేయాలి.

● **గడ్డ పెరుగుదల దశ:** ఈ దశలో పంట అకాలంగా పక్వానికి రావడం, గడ్డ పరిమాణం చిన్నగా ఉండి పగలడం లేదా ఆకారం మారిపోవడం వంటివి జరిగి దిగుబడి తగ్గుతుంది. కయోలిన్ వంటి యాంటి ట్రాన్స్‌పిరెంట్లు 50 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

● **పరిపక్వత, కోత దశ:** నీటి ఒత్తిడికి గురైన మొక్కల మెడ మందం తగ్గి కుళ్లిపోవడం, నిల్వ సామర్థ్యం తగ్గి గడ్డలు పాడవుతాయి.

కర్ణాటక మాజీ సీఎంకు రాఘవేంద్ర స్వామి జ్ఞాపికను అందజేస్తున్న శ్రీమఠం పీఠాధిపతి

మంత్రాలయంలో కర్ణాటక మాజీ సీఎం

మంత్రాలయం, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠాన్ని కర్ణాటక మాజీ సీఎం బి.ఎస్.యడియూరప్ప, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బి.వై.విజయేంద్ర సందర్శించారు. శ్రీ రాఘవేంద్ర గురుసార్వభౌముల దర్శనం చేసుకున్నారు. అనంతరం మఠం పీఠాధిపతి వారి ఇద్దరికీ శేషవస్త్రలు అందించి ఆశీర్వదించారు. స్వామీజీ వారికి జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో మాధవ శెట్టి, మఠం మేనేజర్ ఎస్.కే.శ్రీనివాస్ రావు, ఇన్‌ఛార్జి మేనేజర్ సురేష్ ఐ.పి. నరసింహమూర్తి పాల్గొన్నారు.

జలధార పనుల్లో పురోగతి సాధించండి

పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : జలధార- జల హారతి 2.0 కింద మంజూరు చేసిన పనుల్లో పురోగతి సాధించాలని కలెక్టర్ డా.సిరి ఎంపీడీవోలను ఆదేశించారు. కర్నూలు కలెక్టరేట్ నుంచి సోమవారం ఆమె పీజీఆర్ఎస్, మొక్కల పెంపకం, జలధార- జల హారతి 2.0, సెన్సస్, నాబార్డు పనులపై జిల్లా, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జలధార- జల హారతి 2.0 కింద ప్రస్తుతం 1,005 పనులు గుర్తించగా 669 మంజూరు చేసినట్లు వెల్లడించారు. వీటిలో 56 శాతం పనులు గ్రౌండింగ్ అయ్యాయన్నారు. వీబీ జీ రామ్ జీ పథకం కింద శ్రామికులకు లక్ష్యం మేరకు పనులు కల్పించాలన్నారు. సెప్టెంబరు నెలాఖరులోగా అన్ని శాఖలు నిర్దేశించిన లక్ష్యాల మేరకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. స్వర్ణగ్రామ, స్వర్ణవార్డు కార్యాలయాల్లో ప్రతిరోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఉరుకుంద: భక్తులతో రద్దీగా మారిన ఆలయ వీధులు

ఉరుకుందకు పోటెత్తిన భక్తులు

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద శ్రీ నరసింహ ఈరన్న స్వామి శ్రావణ మాస ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శ్రావణమాసం మూడో సోమవారం కావడంతో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. ఆలయ ఆవరణలో కట్టెల పొయ్యిపై వంటకాలు వండి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. అంతకుముందు భక్తులు తలనీలాలను సమర్పించి దిగువ కాల్వలో పుణ్య స్నానాలు చేశారు. అనంతరం స్వామి వారి దర్శనానికి భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. ఉదయం స్వామివారికి అభిషేకం, అలంకరణ, సహస్ర నామార్చన తదితర పూజలను నిర్వహించారు.

టెట్ రద్దు చేయాలి: డీటీఎఫ్

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఇన్‌సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ రద్దు చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకట్రాముడు డిమాండు చేశారు. డీటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి వినతిపత్రాన్ని సమర్పించారు. వెంకట్రాముడు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంతో ప్రభుత్వం పూర్తిగా విఫలమైనట్లు ధ్వజెత్తారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా హామీలు నేరవేర్చలేదన్నారు. ప్రభుత్వం ఏర్పాడి రెండేళ్ల పూర్తి అయిన ఉపాధ్యాయుల సమస్యల విషయంలో సర్కార్ మొండికేసిందన్నారు. ఉపాధ్యాయుల టెట్ రద్దు చేయకపోతే కనీసం 40% మార్కులు వస్తే ఉత్తీర్ణత సాధించినట్లు జీవో విడుదల చేయాలన్నారు. లేని పక్షంలో ఉద్యమాలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ నాయకులు రామన్న, ఈశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, రాఘవేంద్రరావు, వీరేష్, జగదీష్, ఉపేంద్ర, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న డీటీఎఫ్ నేతలు

బరువు ఎత్తాడు.. పతకం పట్టాడు

◆ వెయిట్ లిఫ్టింగ్‌లో ఆదోని యువకుడి ప్రతిభ

ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే: ఓ వైపు చదువుతూనే మరోవైపు వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాణిస్తున్నాడు ఆదోనికి చెందిన డిగ్రీ విద్యార్థి బావిగడ్డ వీరేశ్. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతిభ చాటుతున్నాడు. ఇటీవల తిరుపతిలో జరిగిన అమరావతి ఛాంపియన్‌షిప్-2026 వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. వెయిట్ లిఫ్టింగ్ పోటీలో రాణిస్తున్న ఈ యువ విద్యార్థిపై న్యూస్‌టుడే ప్రత్యేక కథనం..

అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీల్లో బరువు ఎత్తుతున్న వీరేశ్

● కౌతాళం మండలం తోవి గ్రామానికి చెందిన బావిగడ్డ అయ్యన్న, హనుమంతమ్మ దంపతుల కుమారుడు బావిగడ్డ వీరేశ్ ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీఏ డిగ్రీ చదువుతున్నాడు. ఓ వైపు చదువుతూనే మరోవైపు వెయిట్‌లిఫ్టింగ్‌లో సాధన చేస్తున్నాడు. కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం ప్రోత్సహించడంతో పాటు కళాశాల పీడీ ఎర్రిస్వామి, కర్నూలుకు చెందిన శాప్ కోచ్ యూసుఫ్ బాషా వద్ద కర్నూలు నగరంలోని స్పోర్ట్స్ అకాడమిలో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాడు. గత నెల 24 నుంచి 27వ తేదీలలో తిరుపతిలో జరిగిన అమరావతి ఛాంపియన్‌షిప్-2026 వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 65 కిలోల కేటగిరిలో బరిలో దిగాడు. వెయిట్ లిఫ్టింగ్ స్నాచ్ విభాగంలో 110 కిలోలు, క్లీన్‌అండ్‌జర్క్ విభాగంలో 132 కిలోల బరువు ఎత్తి ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ నెల 29న తిరుపతిలో జరిగిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు.

రాష్ట్రస్థాయిలో 8 పతకాలు సొంతం

జూనియర్, అండర్-23 తదితర విభాగాల్లో జరిగిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఇప్పటివరకు 5 బంగారు పతకాలు, 3 రజత పతకాలు సాధించాడు. 2023 అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి జూనియర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో నాలుగో స్థానం, 2024 హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన జూనియర్ జాతీయస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలో టాప్-10లో నిలిచి ప్రతిభ చాటాడు. జాతీయస్థాయిలో బంగారు పతకాలు సాధించడమే లక్ష్యంగా సాధన చేస్తున్నట్లు వీరేశ్ న్యూస్‌టుడేకు తెలిపాడు.

వ్యవసాయ అనుబంధ రంగాలతో ఆదాయం మెండు

మాట్లాడుతున్న కేవీకే సమన్వయకర్త డా. రాఘవేంద్రచౌదరి

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులు సంప్రదాయ పంటలపై ఆధారపడకుండా అనుబంధ రంగాలపై దృష్టి పెడితే తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్రచౌదరి అన్నారు. సోమవారం బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో కెనరా బ్యాంకు సౌజన్యంతో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ ఇన్‌స్టిట్యూట్ (ఆర్ఎస్ఈటీఐ) సహకారంతో పుట్టగొడుగులు, గొర్రెలు, మేకలు, వానపాముల ఎరువు తయారీపై పది రోజులపాటు ఉండే శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. డా. రాఘవేంద్రచౌదరి మాట్లాడుతూ.. యువత ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధికి బాటగా మార్చుకోవాలన్నారు. పశుసంవర్ధకశాఖ, పాల అభివృద్ధి విశ్రాంత జాయింట్ కార్యదర్శి గురుమూర్తి మాట్లాడుతూ.. వ్యవసాయ అనుబంధ, ఉద్యాన రంగాల్లో ప్రభుత్వం అనేక రాయితీలిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకొని ఆదాయం పొందాలన్నారు. రైతులు నికరాదాయాన్ని పొందేందుకు సమగ్ర వ్యవసాయ విధానంలో భాగంగా గొర్రెలు, మేకలు పెంపకం, వానపాముల ఎరువు తయారీ, పుట్టగొడుగుల పెంపకం చేపట్టాలన్నారు. కెనరా బ్యాంకు మేనేజరు పుష్పక్ ప్రసంగిస్తూ.. గ్రామీణ యువత, రైతులకు అనుబంధ రంగాలతో మెరుగైన ఆదాయం పొందేందుకు శిక్షణ ఇస్తున్నామని సద్వినియోగం చేసుకొని అదనపు ఆదాయం పొందాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా.మౌనిక, డా.నిరంజన్‌రెడ్డి, డా.శ్రీచందన, పుట్టగొడుగుల నిపుణుడు చంద్రశేఖర్, రైతులు, గ్రామీణ యువకులు పాల్గొన్నారు.

విశ్రాంత సబ్ రిజిస్ట్రార్‌పై వేటుకు రంగం సిద్ధం

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే : ఓర్వకల్లు విశ్రాంత సబ్ రిజిస్ట్రార్ సూగమ్మ, మరో ముగ్గురిపై చర్యలకు అనుమతినిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. వారిపై వచ్చిన ఆరోపణలు విచారణలో నిర్ధారణ కావడంతో చర్యలకు అనుమతినిచ్చింది.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : కర్నూలు, ఆదోనిలోని వన్‌స్టాప్ సెంటర్లలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ విజయ సోమవారం తెలిపారు. దరఖాస్తులను కలెక్టరేట్‌లోని ఐసీడీఎస్ కార్యాలయంలో ఈనెల 6వ తేదీ లోపు అందజేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదేళ్ల వయసు సడలింపు ఉంటుందన్నారు.

స్వచ్ఛంద రథం.. సేవలు వేగవంతం

కర్నూలు నగరంలోని 5వ శానిటేషన్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు రాజు వినూత్న ఆలోచనతో చెత్త సేకరణ విధులను సులభంగా.. వేగవంతంగా నిర్వహిస్తున్నారు. తన ద్విచక్ర వాహనానికి ప్రత్యేకంగా ట్రాలీని ఏర్పాటు చేసుకొని ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరిస్తున్నారు. నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు సోమవారం ఈయన చొరవను గుర్తించి ప్రశంసించారు. – న్యూస్‌టుడే, కర్నూలు నగరపాలక సంస్థ

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

మంత్రాలయం, మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం వలన వర్షాభావం నెలకొందని, ప్రజలు ఇబ్బందులు పడకుండా సుఖసంతోషాలతో ఉండేలా చూడాలని రాఘవేంద్ర స్వామిని కోరుకున్నానని శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు తెలిపారు. సోమవారం స్వామివారి మహారథోత్సవం సందర్భంగా పీఠాధిపతి భక్తులనుద్దేశించి మాట్లాడారు. నేపాల్‌లో జరిగిన విధ్వంసంలో చాలామంది భారతీయులు తుదిశ్వాస విడిచారని వారందరికీ ఆత్మశాంతి కలగాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశం సౌఖ్యం కోసం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ ముఖ్యమంత్రులు, మంత్రులు శ్రీమఠానికి సహకరిస్తున్నారన్నారు. శ్రీమఠంలో పనిచేసే స్టాఫ్‌కు 10.92 శాతం డీఏ పెంచుతామని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న వారిని కాంట్రాక్ట్ బేసిక్ ఉద్యోగులుగా గుర్తించి వారందరికీ నెలకు అదనంగా రూ.2,500 చెల్లిస్తామన్నారు.

వివాహిత ఆత్మహత్య కేసులో నిందితుల అరెస్టు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని ఒంటెడుదిన్నె గ్రామంలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. ఆమె ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించిన భర్త రాముడు, అత్త ఈరమ్మ, బావ రంగస్వామిలను గాజులదిన్నె ప్రాజెక్టు అడ్డరోడ్డు వద్ద అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ చంద్రబాబు సోమవారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. ఆదోని మండలంలోని పర్వతాపురం గ్రామానికి చెందిన కురువ మహేశ్వరికి.. ఒంటెడుదిన్నెకి చెందిన కురువ రాముడికి 13 ఏళ్ల కిత్రం వివాహం జరిగింది. వారికి కుమార్తె, కుమారుడు సంతానం. రాముడు మహేశ్వరిని కొంతకాలంగా మానసికంగా శారీరకంగా హింసిస్తున్నాడు. గత నెల 28న భర్త, అత్త, బావ కలిసి కొట్టి చచ్చిపో అంటూ తీవ్రంగా దూషించారు. ఆమె తీవ్ర మనస్తాపానికి గురై పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు ప్రేరేపించిన భర్త, అత్త, బావ, మరిదిలపై కేసు నమోదైంది. నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

తేళ్లతో వెంకన్నకు పూజలు

దర్శనానికి కొండ్రాయి కొండపైకి తరలివచ్చిన భక్తులు | తేళ్లతో భక్తులు

కోడుమూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కోడుమూరులోని కొండ్రాయి కొండపై వెలసిన శ్రీవేంకటేశ్వస్వామికి శ్రావణ మాసం మూడో సోమవారం తేళ్ల పండగను నిర్వహించటం ఆనవాయితీగా వస్తుంది. శ్రీవేంకటేశ్వరస్వామి తేళ్ల పండగాను భక్తులు వైభవంగా నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు కొండపైకి తరలిరావటంతో కొండ్రాయి కొండ భక్తులతో కిటకిటలాడింది. ముందుగా ఆలయంలో కొలువుదీరిన స్వామికి పూలమాలలతో ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలినడకన భక్తులు కొండ్రాయి కొండకు చేరుకుని చిన్న రాళ్లను తీస్తూ తేళ్లను పట్టుకున్నారు. తేళ్లను మాలగా చేసి శ్రీవేంకటేశ్వరస్వామికి సమర్పించారు. కనిపించిన తేళ్లను దారంతో మాలగా చేసి స్వామికి పూజలు చేశారు. కొంత మంది భక్తులు తేళ్లను శరీరంపై, నుదుటిపై, చేతులపై వేసుకుని తమ భక్తిని చాటుకున్నారు. కొండపై భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు.

చట్టం పరిధిలో న్యాయం చేస్తాం

బాధితుల సమస్య వింటున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపట్టి చట్టం పరిధిలో న్యాయం చేస్తామని కర్నూలు మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ ఉపేంద్రబాబు హామీ ఇచ్చారు. నగరంలోని కొత్తపేటలో ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు 99 మంది ఫిర్యాదు పత్రాలు అందజేశారు. వీఆర్వో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి విశ్వనాథ్ అనే వ్యక్తి రూ.4 లక్షలు తీసుకొని మోసగించాడని కర్నూలు అశోక్‌నగర్‌కు చెందిన మనోజ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. తన కుమారులు అన్నం పెట్టకుండా ఇంటి నుంచి గెంటేస్తున్నారని, న్యాయం చేయాలని కర్నూలు మండలం జి.సింగవరం గ్రామానికి చెందిన అయ్యమ్మ విన్నవించుకున్నారు. ఉరుకుందలో తమ పొలాన్ని ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆదోనికి చెందిన చల్లా పాండురంగ, చల్లా శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సీఐలు రామయ్యనాయుడు, ఉపేంద్రబాబు పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణోత్సవం

ఆదోని సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణం సత్యనారాయణపేటలో వెలసిన శ్రీభద్రావతి, భావనారుషీంద్రుల కల్యాణోత్సవ కార్యక్రమం సోమవారం కనులపండువగా జరిగింది. శ్రీభద్రావతి, భావనారుషి పద్మశాలీ సంక్షేమ సంఘం ఆలయంలో శ్రీభద్రావతి, భావనారుషి సమేత శ్రీమార్కండేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు, కల్యాణం నిర్వహించారు. పండితులు భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. ఉత్సవమూర్తులను భజన సందోహం నడుమ పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ప్రత్యేక అలంకరణలో శ్రీ భద్రావతి, భావనారుషిస్వాములు

ఆదోని

•ఆదోని •ఆలూరు •పత్తికొండ

పత్తి క్వింటాలు గరిష్ఠ ధర రూ.9,990

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన వ్యాపారంలో వివిధ పంటల దిగుబడులు సాధారణ రేట్లు పలికాయి. పత్తి క్వింటాలు కనిష్ఠం రూ.6,039, గరిష్ఠం రూ.9,990లు పలికింది. వేరుశనగ కనిష్ఠం రూ.3,509, గరిష్ఠం రూ.8,910.. ఆముదాలు రూ.6,123గా విక్రయించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఆదోని: 77996 66004 ఆలూరు: 80085 62277 పత్తికొండ: 80085 73622

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ?: గ్రామంలోని జలజీవన్ మిషన్ పథకం కింద ఏర్పాటు చేసిన నీటి పైపులు పలుచోట్ల లీకవుతూ నీరు కలుషితమవుతోంది. అధికారులు చర్యలు తీసుకోవాలి. **-నరసింహులు, దూదేకొండ గ్రామం** ✓: పరిశీలించి లీకేజీలు లేకుండా చర్యలు తీసుకుంటాం. **-మనోహర్, పంచాయతీ కార్యదర్శి**

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ?: ఆదోని పట్టణంలో లంగరబావివీధి, విక్టోరియాపేట, హనుమాన్‌పేట తదితర కాలనీలకు తెల్లవారుజాము మూడు గంటలకు నీటి సరఫరా చేస్తున్నారు. దీని వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. **-విజయలక్ష్మి, ఆదోని.** ✓: నీటి విభాగంతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. **-నయీమ్ అహ్మద్, కమిషనర్, ఆదోని పురపాలక సంఘం.**

గ్రామాల అభివృద్ధి కూటమితోనే సాధ్యం

పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు తదితరులు

కృష్ణగిరి, న్యూస్‌టుడే: గ్రామాలను అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించడం సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వానికే సాధ్యమవుతుందని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. ఆయన సోమవారం పత్తికొండ మార్కెట్ యార్డు ఛైర్మన్ నబీ సాహెబ్, మద్రి శ్రీరాములు, మండల తెదేపా అధ్యక్షుడు దామోదర్‌నాయుడు, ఇతర అధికారులతో కలిసి కృష్ణగిరి మండలం కటారుకొండ గ్రామం నుంచి ఆలంకొండ మీదుగా తెగదొడ్డి వరకు రూ.8.23 కోట్లతో నిర్మించతలపెట్టిన బీటీ దారికి భూమి పూజ చేశారు. అనంతరం ఆలంకొండ, చుంచుఎర్రగుడి, పోతుగల్లు గ్రామాల్లో రూ.1.08 కోట్లతో నిర్మించిన ఆరోగ్య కేంద్రాలు, బోయబొంతిరాళ్ల గ్రామంలో రూ.32 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనం, పోతుగల్లులో సీసీదారులు, బొంది మడుగుల.ఆలంకొండ దారి నిర్మాణానికి భూమి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో తెదేపా నాయకులు రఫీ, మురళీమోహన్‌రెడ్డి, గురుస్వామి, రవి, ఏఈ జాకీర్ హుస్సేన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చారిత్రక.. పర్యాటక కేంద్రంగా ఆదోని

❒ అసెంబ్లీలో ఎమ్మెల్యే పార్థసారధి ప్రస్తావన
❒ పలు ప్రాంతాలను ప్రతిపాదించిన అధికారులు

ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామంలోని పురాతన శ్రీరామదేవాలయం

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో పశ్చిమ ప్రాంతమైన ఆదోని నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు చారిత్రక, ఆధ్యాత్మిక వైభవానికి పెట్టింది పేరు. ఆదోని మండలం పెద్దతుంబళంలోని పురాతన శ్రీరామ దేవాలయం, జైన్ దేవాలయం, ఆదోని పట్టణంలోని రణమండల ఆంజనేయస్వామి దేవాలయం, రాంజల తదితర ప్రదేశాలను పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుక అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇటీవల అసెంబ్లీలో ఆదోని ప్రాంతంలోని దేవాలయాలు, చారిత్రక ప్రదేశాల విశిష్టతను ఎమ్మెల్యే పార్థసారథి వివరించిన నేపథ్యంలో ఇక్కడి పర్యాటకంపై న్యూస్‌టుడే ప్రత్యేక కథనం..

ఆదోనిలోని రాంజల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో అరుణాదేవి, అధికారులు

నక్షత్రాకార రామాలయం.. కాంతులీనే జైన దేవాలయం

ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామంలోని పురాతన శ్రీరామదేవాలయాన్ని పాండవులు నిర్మించారని స్థానికులు చెబుతారు. నక్షత్రాకారంలో ఉండే ఈ దేవాలయ శైలి చాళుక్యుల కాలం నాటిదని చరిత్రకారులు చెబుతారు. దక్షిణ భారతదేశంలో ఈ ఆకారంలో నిర్మించిన కట్టడాలలో ఇది రెండోదని పేర్కొంటారు. 2016లో ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా ఈ ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తించి ఉన్నతాధికారులు అవార్డు అందజేశారు. చారిత్రక, ఆధ్యాత్మిక వైశిష్ట్యమున్న ఈ ఆలయాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకతం ఉంది.

● పెద్దతుంబళం గ్రామంలోనే ఉన్న మరో ఆధ్యాత్మిక మణిపూస..పార్శ్వనాథ జైన తీర్థం. జైనుల ఆరాధ్యదైవం పార్శ్వమణి పార్శ్వనాథుడు ఈ ఆలయ ప్రధాన దైవం. ఆరు దశాబ్దాల క్రితం ఓ రైతు పొలంలో బావి తవ్వుతుండగా పార్శ్వమణి పార్శ్వనాథ్ స్వామి విగ్రహం బయట పడింది. స్థానికుల కోరిక మేరకు రాజస్థాన్‌కు చెందిన భక్తులు 1992లో పాలరాతితో ఈ భారీ ఆలయాన్ని నిర్మించారు. అచ్చెరువొందే అందాలతో, కాంతులీనుతూ చూపరులను విశేషంగా ఆకట్టుకునే ఈ దేవాలయానికి మరింత ప్రాచుర్యం కల్పించాలని నిపుణులు, స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

● వీటితోపాటు ఆదోని పట్టణ శివారులో కొండపై వెలసిన ఆదోని రణమండల ఆంజనేయస్వామి, రాంజల ప్రాంతం, లక్ష్మమ్మ అవ్వ దేవాలయం, కౌతాళం మండలంలోని ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయం తదితర ప్రాంతాలన్నీ పర్యాటక ప్రాముఖ్యం కలిగి ఉన్నవే. ప్రభుత్వం వీటన్నింటినీ గుర్తించి వెలుగులోకి తీసుకొచ్చి.. అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

అధికారుల పర్యటన.. ప్రతిపాదనలు సిద్ధం

ఆదోని నియోజకవర్గంలోని చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశాల అభివృద్ధికి ప్రాధాన్యం కల్పించాలనే ఉద్దేశంతో కలెక్టర్ ఆదేశాల మేరకు పెద్దతుంబళం శ్రీరామ దేవాలయం, జైన దేవాలయం, పట్టణంలోని రాంజల ప్రాంతాలను ఇటీవల ఆర్డీవో అరుణాదేవి ఆధ్వర్యంలో పర్యాటక, దేవాదాయ, మున్సిపల్ శాఖ అధికారులు పరిశీలించారు. ఈ ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన అంశాలపై చర్చించి..ప్రతిపాదనలు సిద్ధం చేసి, ఉన్నతాధికారులకు పంపాలని నిర్ణయించారు.

ఆదోని మండలం పెద్దతుంబళంలోని జైన దేవాలయం

యోగా పోటీల్లో ఆదోని విద్యార్థిని ప్రతిభ

నిథాలి డి.జైన్‌కు బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే: పట్టణంలోని లీలాస్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న నిథాలి డి.జైన్ గత నెల 29వ తేదీన విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి యోగా స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్-2026 పోటీల్లో మూడో స్థానంలో నిలిచి.. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది.

ప్రధానోపాధ్యాయుడికి ఘన సన్మానం

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని మసూదియా అరబిక్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తు పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయుడు తేలి హుసేన్‌ను సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ సలాఉద్దీన్, షాహీ జామియా మసీదు చీఫ్ ట్రస్ట్ సౌదీరవూఫ్ పాల్గొన్నారు.

బాబోయ్ శునకాలు.. స్థానికుల తంటాలు

పత్తికొండ పట్టణంలోని పలు కాలనీల్లో వీధి కుక్కల బెడద అధికంగా ఉంటోంది. గుంపులుగుంపులుగా సంచరిస్తూ స్థానికుల్ని బెంబేలెత్తిస్తున్నాయి. పిల్లలు, వృద్ధులు, మహిళలు వీధుల్లోకి రావాలంటేనే హడలిపోతున్నారు. శివాలయానికి వెళ్లే దారిలో సోమవారం కుక్కలు చుట్టుముట్టడంతో ఓ వృద్ధురాలు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు అదిలించడంతో కుక్కలు పారిపోయాయి. తరచూ వాహనదారుల వెంట పడుతుండటంతో వారు ప్రమాదాలకు గురవుతున్నారు. కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, పత్తికొండ గ్రామీణం

ఎస్ఎస్ ట్యాంకుకు దారేది ?

చిప్పగిరి మండలం, బెల్డోణ వద్ద రూ.5 కోట్ల వ్యయంతో నిర్మించిన ఎస్ఎస్ ట్యాంకు వెళ్లే మార్గం కంపచెట్లతో మూసుకుపోయింది. ఈ మార్గంలో వెళ్లాలంటే కళ్యాణి వంక దాటి వెళ్లాలి. సరైన దారి లేకపోవడంతో సిబ్బంది కాలినడకన వెళ్లి నీటి సరఫరా చేస్తున్నారు. ఆలూరు-గుంతకల్లు రహదారి నుంచి ట్యాంకు వెళ్లే మార్గంలో కనీసం గ్రావెల్ వేయలేదు. ఈ కారణంగా చిన్నపాటి వర్షం వస్తే ట్యాంకు వద్దకు వెళ్లడం కష్టంగా మారింది. ట్యాంకు వెళ్లే మార్గాన్ని గ్రావెల్ వేసి మరమ్మతు చేయాలని ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, చిప్పగిరి

పాఠశాల ఏర్పాటుతో విద్యాహబ్‌గా కంబాలపాడు

పాఠశాలను ప్రారంభిస్తున్న ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

కృష్ణగిరి, న్యూస్‌టుడే: మహాత్మా జ్యోతిబా పులె గురుకుల పాఠశాల ఏర్పాటుతో కంబాలపాడు విద్యాహబ్‌గా ఆవిష్కృతమైందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పేర్కొన్నారు. కంబాలపాడు గ్రామంలో సోమవారం వారు నూతనంగా మహాత్మా జ్యోతిబా పులె గురుకుల పాఠశాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ..కంబాలపాడులో 5నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ఈ పాఠశాల దోహదపడుతుందని తెలిపారు. ఇప్పటికే ఈ ఉన్నత పాఠశాల, గురుకులంలో దాదాపు 1800 మంది విద్యార్థినీవిద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని వెల్లడించాచారు. కార్యక్రమంలో కేఈ శేషాద్రి, నబిసాహెబ్, మండల తెదేపా అధ్యక్షుడు దామోధర్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

● కృష్ణగిరి ఉన్నత పాఠశాలను సోమవారం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ..వచ్చే మార్చిలో పదోతరగతిలో 500కు పైగా మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున బహుమతి ఇస్తానని ఎంపీ పేర్కొన్నారు.

ఆదోని తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన వేణుగోపాల్‌రావు

వేణుగోపాల్‌రావు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని తహసీల్దారుగా వేణుగోపాల్‌రావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దారు శేషఫణి సెలవుల్లో వెళ్లారు. కోసిగిలో పనిచేస్తున్న తహసీల్దారు వేణుగోపాల్‌రావును(ఎఫ్ఏసీ)గా నియామకం చేశారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతలు చేపట్టిన తహసీల్దారు వేణుగోపాల్‌రావును ఆదోని ఉప తహసీల్దారు బాబు, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుచ్చగుచ్ఛం అందజేసి సన్మానించారు. అనంతరం వేణుగోపాల్ రావు ఆర్డీవో అరుణాదేవిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఘనంగా గంగి ఉత్సవాలు

నారాయణపురం(ఆదోని గ్రామీణం), న్యూస్‌టుడే: ఆదోని మండలం నారాయణపురం గ్రామంలో శ్రావణమాసం మూడో సోమవారం పురస్కరించుకుని గంగి(గంగ) ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గ్రామ సమీపంలోని వంకకు గర్జిలింగేశ్వరస్వామిని తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంగ పూజ, అర్చనలు, మహామంగళహారతి, తీర్థప్రసాదం, బీరప్ప డోళ్లు ప్రదర్శన, దేవుని పాటల స్తుతి, సంప్రదాయ కాలాట నృత్యం, భవిష్యవాణి తదితర కార్యక్రమాలు జరిగాయి. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఆదోని మండలం నారాయణపురం గ్రామంలో గర్జిలింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దని ఆదోని ఆర్డీవో అరుణాదేవి పేర్కొన్నారు. ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజల నుంచి ఆర్డీవో అరుణాదేవి అర్జీలు స్వీకరించారు. మొత్తం 31 అర్జీలు వచ్చాయి. సమస్యలు తెలుసుకున్న ఆర్డీవో సంబంధిత అధికారులకు నిర్దేశించారు.

ఆ మృతదేహం కర్ణాటక వ్యక్తిది!

శరణప్ప (పాత చిత్రం)

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణ శివారు కొండ ప్రాంతంలో ఆగస్టు 27న గుర్తుతెలియని ఓ వృద్ధుడి మృతదేహాన్ని ఆదోని మూడో పట్టణ పోలీసులు గుర్తించారు. ఈ మేరకు దర్యాప్తు ప్రారంభించగా మృతుడు కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా జవాల్‌గేరలోని శ్రీనివాస క్యాంపునకు చెందిన శరణప్ప(73) అని గుర్తించారు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు..శరణప్పకు భార్య శంకరమ్మ, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె సంతానం. ఆయనది గ్రామంలో కిరాణా వ్యాపారం. ఇటీవల ఆయన తరచూ అనారోగ్యానికి గురవుతుండటంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు 27న ఆదోని పట్టణ శివారు రణమండల కొండ ప్రాంతానికి వచ్చి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు సోమవారం స్టేషన్‌కు వచ్చి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. కాగా..శ్రీనివాస క్యాంపునకు చెందిన ఐదుగురు వ్యక్తులు వృద్ధాప్య సమస్యలతో గతంలో ఊరి నుంచి కనిపించకుండాపోయినట్లు తమ విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు.

మాదక ద్రవ్యాలు వద్దు

చిప్పగిరి అంబేడ్కర్ కూడలి వద్ద మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

చిప్పగిరి, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు స్థానిక కళాశాల నుంచి అంబేడ్కర్ కూడలి వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ వరదరాజులు సీనియర్ అధ్యాపకులు సుబ్రమణ్యం, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

42 అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల ఎంపిక

ఆస్పరి, న్యూస్‌టుడే: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, జిల్లా పరిషత్తు పాఠశాలల్లో పనిచేయడానికి 42 మంది అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను ఎంపిక చేసినట్లు ఎంఈవో రాజేంద్రప్రసాద్ తెలిపారు.

వృద్ధుడి ఆచూకీ కోసం గాలింపు

చిప్పగిరి, న్యూస్‌టుడే : హంద్రీ కాలువలో గల్లంతైన వృద్ధుడి ఆచూకీ కోసం బంధువులు, పోలీసులు గాలిస్తున్నారు. ఆదివారం హంద్రీ కాలువలో దూకి చిప్పగిరి మండలం, బెల్డోణ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు సోమలింగమ్మ (60), సీతన్న (64) ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. సోమలింగమ్మ మృతదేహం లభించగా శవపరీక్ష చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సీతన్న ఆచూకీ లభించకపోవడంతో గాలింపు కొనసాగించారు.

బిల్లేకల్లు మార్కెట్ వేలం రూ 65 లక్షలు

ఆస్పరి, న్యూస్‌టుడే: భారీ పోలీసు బందోబస్తు నడుమ బిల్లేకల్లు మార్కెట్ వేలంపాటను సోమవారం పత్తికొండ డివిజన్ అభివృద్ధి అధికారి శివశంకర్, ఎంపీడీవో గీతావాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. వేలంలో దాదాపు 7 మంది వ్యాపారస్థులు పాల్గొనగా.. ఈడిగ బాలయ్య రూ.65,51,250కు దక్కించుకున్నారు. వేలం పాడుకున్న వారు నెలలోపు పంచాయతీకి డబ్బులు చెల్లించాలని అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ వెంకటేశ్వర్లు, సీఐలు శ్రీనివాసనాయక్, పులిశేఖర్, వేణుగోపాల్, మద్దికెర ఎస్సై హరిత, డిప్యూటీ ఎంపీడీవో విజయభాను, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడికి గాయాలు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వే విద్యుత్తు ఉపకేంద్రంలో పనిచేస్తున్న నాగేంద్ర అనే కార్మికుడు విద్యుదాఘాతానికి గురై సోమవారం గాయపడ్డారు. సహోద్యోగులు తెలిపిన వివరాలు..తుగ్గలి మండలం, జొన్నగిరి గ్రామానికి చెందిన నాగేంద్ర విద్యుత్తు ఉపకేంద్రంలో ఒప్పంద కార్మికుడికి పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా విద్యుత్తు నియంత్రిక పైకి ఎక్కి పనిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యారు. బాధితుడిని సహోద్యోగులు 108 అంబులెన్సులో కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు.

పంచాయతీ భవనానికి భూమి పూజ

చాగి(ఆదోని గ్రామీణం), న్యూస్‌టుడే: ఆదోని మండలం చాగి గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి సోమవారం తెదేపా నాయకులు భూమి పూజ చేశారు. నిర్మాణం నిమిత్తం రూ.32 లక్షల నిధులు మంజురయ్యాయి. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు మల్లికార్జునరెడ్డి, రాము, గుళెప్ప, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

పేదలపై మోయలేని భారం

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు పేద ప్రజల జీవన పరిస్థితులపై తీవ్ర ప్రభావం పడుతుందని సీపీఎం మండల కార్యదర్శి కె.వెంకటేశ్వరరెడ్డి అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను నిరసిస్తూ పత్తికొండ నాలుగు స్తంభాల కూడలి వద్ద సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువులు రోడ్డుపై పోసి నిరసన తెలిపారు. నిత్యావసరాల ధరలు మండిపోతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవటంలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు నరసన్న, వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, శిఖామణి, రాజుల కారప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

కరవు మండలంగా ప్రకటించాలి

సాంబగల్, నెట్టెకల్(ఆదోని గ్రామీణం), న్యూస్‌టుడే: ఎల్‌నినో ప్రభావంతో పంటలు పూర్తిగా దెబ్బతినడంతో ఆదోని మండలం 1, 2లను కరవు మండలాలుగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదోని మండలం నెట్టెకల్, సాంబగల్ గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను సోమవారం రైతు సంఘం నాయకులు పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, కరవు మండలంగా ప్రకటించి ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి అయ్యప్ప, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లింగన్న, నాయకులు హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో వ్యక్తికి ఏడాది జైలుశిక్ష

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని కోర్టులో..చోరీ కేసులో దోషిగా తేలిన భాస్కరాచారి అనే వ్యక్తికి ఏడాది జైలు శిక్ష విధించారు. పెద్దతుంబళం ఎస్సై విద్యశ్రీ తెలిపిన వివరాలు..ఆదోని మండలం కుప్పగల్ గ్రామానికి చెందిన హరికృష్ణకు చెందిన మోటారుసైకిల్‌ను 2026 జనవరి 3వ తేదీన అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం కదిరి బెంచి గ్రామానికి చెందిన భాస్కరాచారి దొంగిలించాడు. ఈ మేరకు పెద్దతుంబళం పోలీసులు నిందితుడిని 2026 ఏప్రిల్ 16న అరెస్టు చేసి రిమాండుకు పంపారు. విచారణ సందర్భంగా సోమవారం భాస్కరాచారి నేరం ఒప్పుకోవడంతో ఆదోని రెండో జ్యుడిషియల్ మొదటి శ్రేణి మేజిస్ట్రేట్ కోర్టు నిందితుడికి ఏడాది సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చింది. ఈ మేరకు నిందితుడిని ఆదోని ప్రత్యేక కారాగారానికి తరలించారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

హొళగుంద, న్యూస్‌టుడే: హొళగుంద పోలీసు స్టేషన్ పరిధిలో లింగంపల్లి గ్రామానికి చెందిన 19 ఏళ్ల యువతి కనబడకుండా పోయినట్లు హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మీరామ్ నాయక్ సోమవారం తెలిపారు. యువతి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అర్హులందరికి పెన్షన్లు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: అర్హులందరికి కొత్త పెన్షన్లు మంజురు చేయడానికి సీఎం నిర్ణయం తీసుకున్నారని రాష్ట్ర తెదేపా మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి గడ్డా ఫక్రుద్దీన్ తెలిపారు. ఆదోనిలో సోమవారం ఆయన మాట్లాడుతూ..ఈ నెలలోనే సంబంధిత దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు.

క్షయ వ్యాధి నివారణపై సదస్సు

ఆదోని వైద్యం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని టీబీ యూనిట్ కేంద్రంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం క్షయ వ్యాధి నివారణపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో టీబీ నివారణ జిల్లా సమన్వయకర్త రామకృష్ణ హాజరై మాట్లాడారు. మొండి క్షయ వ్యాధి కలిగినవారు ప్రతి నెల క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.

In The Court of the Principal Junior Civil Judge
Court: Adoni
E.P.No: 47/2019 IN ARC/KNL/11/2012
Between:-
M/s మార్గదర్శి చిట్ ఫండ్ ప్రై. లిమిటెడ్ కర్నూలు బ్రాంచి తరుపున మేనేజరు/పోర్మెన్ **-Decree Holder**
and
J.ఖాజా బాషా మరియు ఇతరులు **-JDr's**
వేలము ప్రకటన
మార్గదర్శి చిట్ ఫండ్ కంపెనీవారు తమకు రావలసిన డిక్రీ బాపతు బాకీ వసూలు నిమిత్తం జె.డి.ఆర్.నెం:4 G.MD.SAMIULLAHకు సంబంధించిన దిగువ కనబరిచిన షెడ్యూలు ఆస్తిని వేలము కొరకు కోర్టువారిని అభ్యర్థించినారు. కోర్టువారి ఉత్తర్వు మేరకు తేది: 24-09-2026న ఉదయం: 10:30 గంటలకు వేలం నిశ్చయించినారు. ఆసక్తికల వేలం పాటదారులు సదరు కోర్టుకు హాజరై వేలం పాట కోర్టు నిబంధనలకు లోబడి పాడుకొనవచ్చును అని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.
This property situated in R·D of Kurnool S.R·D of Adoni ప్లాట్ నెం : 17, మండిగిరి గ్రామ పంచాయతీ, ఆదోని. విస్తీర్ణం: 158.08 Sq.yds. సర్వే నెంబరు: 572/3/1. డాక్యుమెంట్ నెం: 341/2009, తేది: 26-01-2009, సబ్ రిజిస్టర్ ఆఫీసు, ఆదోని.
హద్దులు: ఉత్తరం: మిగులు ప్లాట్ నెంబరు - 17, **దక్షిణం:** మిగులు ప్లాట్ నెంబరు-17, **తూర్పు:** 60 అడుగుల వెడల్పు గల రోడ్డు, **పడమర:** H.ఈశ్వరమ్మ పొలము
D.H.R Value: 9,00,000/-,
Ameena Value: 12,00,000/-, Market Value: 9,48,480/-
వాయిదా తేది: 24-09-2026
కోర్టువారి ఉత్తర్వు మేరకు
P.Rajendra Prasad, Advocate,
Adoni. Cell: 63018 67276.

ప్రజాసేవలో మద్దికెర మిత్రబృందం

◆ ఆపద్బాంధవ సేవా సమితి పేరిట పలు సేవా కార్యక్రమాల నిర్వహణ

రక్తదానం చేస్తున్న సేవా సమితి సభ్యులు

మద్దికెర, న్యూస్‌టుడే: ప్రజాసేవే పరమావధిగా భావించిన ఆ యువతీయువకులు ఆపద్బాంధవ సేవా సమితి పేరిట వేదికను ఏర్పాటు చేశారు. వందలమందికి రక్తదానం..వేలమందికి విద్యాదానం చేస్తూ మద్దికెరతో పాటు సమీప గ్రామ ప్రజలకు నిజమైన ఆపద్బాంధవుల్లా మారారు. ఆదర్శంగా నిలుస్తున్న ఈ మిత్రబృందంపై న్యూస్‌టుడే కథనం..

వందలమందికి రక్తదానం

ఏ సమయంలోనైనా ఆపదలో ఉన్నారు..రక్తం అవసరం అంటే చాలు.. ఆపద్బాంధవ సేవా సమితి యువకులు ప్రత్యక్షమవుతారు. రక్తదానం చేసి బాధితులకు అండగా నిలుస్తారు. అంతేకాకుండా పేదరికం కారణంగా వైద్యసేవలు పొందలేనివారికి ఆర్థిక సాయం అందిస్తారు. దీనికి నిదర్శన..ఇటీవల బాషా అనే యువకుడు లివర్ సంబంధిత వ్యాధితో ఆసుపత్రిలో చేరగా..వైద్యఖర్చుల నిమిత్తం యువకుడికి ఆపద్బాంధవ సేవా సమితి బృందం రూ.2.20 లక్షలు అందించి ఆదుకున్నారు. ఇలా ఎందరో పేదలు, వృద్ధులకు వైద్యపరీక్షలు చేయిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ

ఏపీఆర్‌జేసీ, ఎమ్‌సెట్, పాలీసెట్ తదితర ప్రవేశపరీక్షలకు పోటీపడే సమీప గ్రామాల విద్యార్థులకు ఆపద్బాంధవ సేవా సమితి ఏడేళ్లుగా ఉచిత శిక్షణ అందిస్తోంది. వందలమంది విద్యార్థులకు ఇలా ఉచిత శిక్షణ అందించారు. గ్రామాల్లో మొక్కల పెంపకం, పాఠశాల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, ఇతర సేవాకార్యక్రమాలను నిర్వహించడంతో పాటు స్థానిక యువతను భాగస్వాముల్ని చేస్తున్నారు.

సేవల విస్తరణే లక్ష్యం -సునీల్‌కుమార్, ఆపద్బాంధవ సేవా సమితి అధ్యక్షుడు, మద్దికెర

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో కలగాలి. సమాజ ప్రగతికి తోడ్పడేలా యువశక్తిని తీర్చిదిద్దడంతో పాటు రాష్ట్రం నలుమూలలా ఆపద్బాంధవ సేవా సమితి సేవల్ని విస్తరించాలనేదే మా లక్ష్యం.

(c) eenadu

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

కెమెరాను అమర్చిన అటవీశాఖ అధికారులు

చిరుత కోసం ట్రాప్ కెమెరా ఏర్పాటు

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: పది రోజులుగా హాల్వి, గోతులదొడ్డి కొండల్లో చిరుత పులి సంచరిస్తూ రాత్రివేళల్లో మూగ జీవులపై దాడి చేస్తుంది. దీంతో అటవీశాఖ అధికారులు సోమవారం గోతులదొడ్డి కొండల్లో చిరుతను గుర్తించేందుకు ట్రాప్ కెమెరా అమర్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ తేజస్వి, సెక్షన్ అధికారి విజయభాస్కర్ తదితదరులు పాల్గొన్నారు.

తుంగభద్ర నదిలో మొసలి కలకలం

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: మేళిగనూరు గ్రామం వద్ద తుంగభద్ర నదిలో సోమవారం మొసలి కలకలం రేపింది. నది ఒడ్డున ఉన్న రామలింగేశ్వర ఆలయం వెనకభాగంలో మొసలి కనిపించడంతో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. మేళిగనూరు ఆలయ పరిసర ప్రాంతాల్లో నదిలో 4 నుంచి 5 మొసళ్లు సంచరిస్తున్నాయని, అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు 8008573824
కోడుమూరు 9885988357
కౌతాళం 8008574913

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: ?: మండల పరిధిలోని గంగులపాడులో వీధిదీపాలు వెలగడం లేదు. రాత్రిపూట వృద్ధులు, మహిళలు, చిన్నారులు బయటికి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. **- ఈరన్న, గంగులపాడు గ్రామం.** ✓: సమస్యను గ్రామ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. **- ఎంపీడీవో, ప్రభావతి దేవి, పెద్దకడబూరు.**

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ?: లక్ష్మణ్‌టాకీస్ వెనుక ప్రాంతంలో విద్యుత్తు దీపాలు లేక అంధకారంలో ఉంటున్నాం **- హరికృష్ణ, కాలనీవాసి** ✓: కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. **- నీరజ, డీఈ** ?: రామయ్యకొట్టాలో డ్రైనేజీలు శుభ్రం చేయడం లేదు. దుర్వాసన వెదజల్లుతోంది. **- రఫీక్, కాలనీవాసి** ✓: పూడిక తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. **- శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్** ?: ముగతిపేటలో తాగునీటి పైపులైన్ లీకేజీతో నీరంతా వృథా పోతుంది. **- రంగప్ప, స్థానికుడు** ✓: మరమ్మతులు చేయిస్తాం. **- కరుణాకర్, ఏఈ**

కేవీకేను సందర్శించిన అనంతపురం రైతులు

అజొల్లా యూనిట్‌ను పరిశీలిస్తున్న అన్నదాతలు

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రాన్ని సోమవారం అనంతపురం జిల్లాకు చెందిన ఉరవకొండ, కల్యాణదుర్గానికి చెందిన 80 మంది రైతులు ఆత్మ ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా అజొల్లా, వానపాముల ఎరువు తయారీ, పశుగ్రాసాలు, షేడ్‌నెట్‌లో మొక్కల పెంపకం వంటి ప్రదర్శన క్షేత్రాలను పరిశీలించారు. కేవీకే సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి మాట్లాడుతూ.. రైతులు క్షేత్రస్థాయిలో ఆధునిక సాంకేతికతలు, మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ పద్ధతులను అవలంబిస్తే తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ అధికారి నర్సింహులు, భూసార నిపుణుడు తేజకుమార్, రైతులు పాల్గొన్నారు.

చౌకగా కొంటూ.. రూ.లక్షల్లో గడిస్తూ

■ ఎమ్మిగనూరు నియోజకవర్గంలో యథేచ్ఛగా తరలిపోతున్న రేషన్ బియ్యం

రేషన్ బియ్యం తరలిస్తూ పట్టుబడిన వాహనం

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలో పేదల రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. కొందరు వ్యాపారులు రేషన్ బియ్యాన్ని కొని గుట్టుగా సరిహద్దులు దాటించి నల్లబజారుకు తరలిస్తున్నారు. బియ్యం అక్రమ రవాణా కొనసాగుతున్న అరికట్టడంలో సంబంధిత శాఖలు చూసీచూడనట్లు వ్యవహరించడంపై పలు విమర్శలు వెలువడుతున్నాయి. తాజాగా జనసేన నాయకులు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాన్ని వెంబడించి పట్టుకొని పోలీసులకు అప్పగించడం చర్చనీయాంశంగా మారింది.

ఎమ్మిగనూరు పరిధిలో ఎమ్మిగనూరు పట్టణం, ఎమ్మిగనూరు గ్రామీణం, నందవరం, గోనెగండ్ల, మంత్రాలయం, పెద్దకడబూరు మండలాల్లో 224 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ప్రతీ నెల రేషన్ దుకాణాల ద్వారా 2,100 మెట్రిక్ టన్నుల బియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి బియ్యం అక్రమ రవాణాకు బీజం పడుతోంది. ఎంఎల్ఎస్ పాయింట్‌లో డీలర్లకు నిర్దేశించిన మేర బియ్యం ఇవ్వకుండా కోత విధిస్తున్నారు. డీలర్లు కోత విధించిన బియ్యం లోటును భర్తీ చేసుకు

లబ్ధిదారులపై ప్రభావం..

నేందుకు లబ్ధిదారులకు తక్కువ బియ్యం పంపిణీ చేస్తారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో డీలర్లు కొందరు మొక్కుబడిగా బియ్యం పంపిణీ చేస్తూ అక్రమ బియ్యం వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఆ బియ్యాన్ని సరిహద్దు దాటించి కర్ణాటక, మహారాష్ట్ర తరలిస్తున్నారు. అక్కడ క్వింటా రూ.3 వేలకు పైగా విక్రయిస్తున్నారు. అక్రమ వ్యాపారులు లారీకి రూ.లక్ష వరకు లబ్ధి పొందుతున్నారు. బియ్యం అక్రమ రవాణా ద్వారా రూ.లక్షల్లో ఆదాయం వస్తుండటంతో రేషన్ బియ్యం యథేచ్ఛగా సరిహద్దులు దాటి వెళ్తోంది.

నూకలుగా మార్చి విక్రయం

● ఎమ్మిగనూరు మండలంలోని ఓ గ్రామంలో బియ్యాన్ని నూకలుగా మార్చి వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. నూకలను కొందరు ఆహారంగా, చేపలకు మేత, పశువులకు దాణాగా వినియోగిస్తారు. నూకలకు మార్కెట్లో డిమాండ్ ఉండటంతో బియ్యాన్ని అలా మార్చి అమ్ముతున్నారు. గతంలో బియ్యం నూకలు చేసి అమ్ముతుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్న ఘటనలు అనేకం ఉన్నాయి. ● తాజాగా ఓ వాహనంలో 37.86 క్వింటాలు బియ్యం అక్రమంగా తరలిస్తుండగా జనసేన నేతలు వాహనాన్ని వెంబడించి ఎర్రకోట వద్ద పట్టుకొని పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ● మాధవరం చెక్ పోస్టు వద్ద అక్రమ బియ్యం లారీ సరిహద్దు దాటుతుండగా పోలీసులు పట్టుకున్నారు.

● గతంలో ఎమ్మిగనూరులో విజిలెన్స్ అధికారుల దాడుల్లో 300 క్వింటాళ్ల బియ్యం పట్టుబడింది. బియ్యం అక్రమ రవాణా కొనసాగుతున్న సంబంధిత అధికారులు మామూళ్లు తీసుకొని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెలువడుతున్నాయి.

అనుమతి లేకుండా పాఠశాలలు నిర్వహిస్తే చర్యలు

పాఠశాలను సీజ్ చేస్తున్న ఎంఈవో జ్యోతి, తదితరులు

సి.బెళగల్,న్యూస్‌టుడే: ఎలాంటి అనుమతి లేకుండా తరగతులు నిర్వహిస్తున్న మండల కేంద్రంలోని గ్లోబల్ ప్రైవేటు పాఠశాలను సోమవారం ఎంఈవో జ్యోతి ఆధ్వర్యంలో సీజ్ వేసారు. ఈ సందర్భంగా ఎంఈవో జ్యోతి మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతులు లేని పాఠశాలలో విద్యార్థులను చేర్పించి వారి భవిష్యత్తును ఇబ్బందులకు గురి చేయొద్దని తల్లిదండ్రులకు సూచించారు. అనుమతి లేకుండా పాఠశాలలను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

రహదారి శిథిలం.. ప్రయాణం నరకం

ఎమ్మిగనూరు- గూడూరు రహదారిలో కలుగొట్ల దగ్గర పలుచోట్ల గుంతలు పడ్డాయి. వాహనాలు తిరిగేందుకు ఇబ్బందిగా మారింది. ఈ రోడ్డుని దాదాపు ఆరు నెలల క్రితం నిర్మించారు. రోడ్డు అంచుల్లో గరుసు సరిగా వేయక చిన్నపాటి వర్షానికి నీరు నిలుస్తున్నాయని వాహనదారులు చెబుతున్నారు. రహదారిపై వర్షం నీరు నిల్వకుండా గరుసు వేయాలని ప్రయాణికులు విన్నవిస్తున్నారు. – న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు గ్రామీణం

పూడిక తీయక.. మురుగు పారక

ఎమ్మిగనూరు పట్టణంలో మునెప్పనగర్ కాలనీలో మురుగు కాలువల పరిస్థితి అధ్వానంగా ఉంది. కాలువ పొడవునా పూడికతో నిండిపోయింది. నిత్యం దుర్వాసన వెదజల్లడంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమలు, ఈగల వృద్ధి చెందుతున్నాయని, జ్వరాల బారిన పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

ఓంనగర్ బస్టాండుకు మోక్షమెన్నడు ?

మండలంలోని ఓంనగర్ బస్టాండు ఏళ్ల తరబడి మొండి గోడలకు పరిమితమైంది. ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించ తలపెట్టిన బస్టాండు నిధుల లేమితో మధ్యలో నిలిచి పోయింది. ఇక్కడ ప్రయాణికులు ఎండ, వానలో బస్సుల కోసం వేచి చూస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల గడుస్తున్న బస్టాండు నిర్మాణాన్ని పట్టించుకోవడం అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబధిత ఉన్నతాధికారులు నిధులు మంజూరు చేసి నిర్మాణాన్ని పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. – పెద్దకడబూరు, న్యూస్‌టుడే

సారు.. మరమ్మతులు చేయించరూ..

పట్టణంలోని గీతా మందిర్ వెనుకలో ఉన్న రహదారి మధ్యలో మ్యాన్‌హోల్ నోరు తెరుచుకుంది. ఈ దారిలో నిత్యం వందల మంది రాకపోకలు సాగిస్తారు. ఏ మాత్రం ఏమరపాటుగా వెళ్లిన ప్రమాదాలు చోటు చేసుకుంటాయి. ప్రమాద సూచికగా రాళ్లు పెట్టి కర్రకు ఎర్ర గుడ్డ కట్టి రహదారి మధ్యలో పెట్టారు. అధికారులు స్పందించి మ్యాన్‌హోల్ మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు విన్నవిస్తున్నారు. – న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు నేరవార్తలు

15 రోజులకోసారి వేతనాలు: ఏపీఓ

కూలీలతో మాట్లాడుతున్న చంద్రశేఖర్

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: వీబీజీ రాంజీ పథకంలో కొలతల ప్రకారం పనులు చేస్తే దినసరి వేతనం గరిష్ఠంగా రూ.312 లభిస్తుందని ఏపీఓ చంద్రశేఖర్ కూలీలకు సూచించారు. మండలంలోని కల్లుకుంట, పెద్దకడబూరు నందు పంట కాల్వల్లో చేస్తున్న ముళ్ల పొదల తొలగింపు పనులను ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన కరవు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పని దినాలు పెంచే యోచనలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నట్లు తెలిపారు. ఇక నుంచి 15 రోజులకోసారి వేతనాలు చెల్లిస్తున్నట్లు తెలిపారు. కూలీలు వలసలు వెళ్లకుండా పనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తాగునీటి పథకాన్ని సకాలంలో పూర్తి చేయాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: తాగునీటి పథకాన్ని భూమి పూజ చేసిన ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డి సకాలంలో పూర్తి చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న డిమాండు చేశారు. సోమవారం ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో ప్రజలను మభ్య పెట్టకుండా త్వరగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

నిబంధనలు పాటించాలి

గూడూరు గ్రామీణం,న్యూస్‌టుడే: వాహనదారులు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని కె.నాగలాపురం ఎస్సై అఖిల్ కుమార్ హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని పెంచికలపాడు స్టేజీ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. నిబంధనలు పాటించని పలు వాహనాలపై చలానాలు విధించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ పెన్షన్లు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: అర్హులందరికీ కొత్త పెన్షన్లు మంజూరు చేయడానికి సీఎం చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారని రాష్ట్ర తెదేపా మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి గడ్డా ఫక్రుద్దీన్ తెలిపారు. ఆదోనిలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెలలోనే సంబంధిత దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు.

బిల్లేకల్లు మార్కెట్ వేలం రూ. 65 లక్షలు

ఆస్పరి, న్యూస్‌టుడే: భారీ పోలీసు బందోబస్తు నడుమ బిల్లేకల్లు మార్కెట్ వేలంపాటను సోమవారం పత్తికొండ డివిజన్ అభివృద్ధి అధికారి శివశంకర్, ఎంపీడీవో గీతావాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. వేలంలో దాదాపు 7 మంది వ్యాపారస్థులు పాల్గొనగా.. ఈడిగ బాలయ్య రూ. 65,51,250కు దక్కించుకున్నారు. వేలం పాడుకున్న వారు నెలలోపు పంచాయతీకి డబ్బులు చెల్లించాలని అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ వెంకటేశ్వర్లు, సీఐలు శ్రీనివాసనాయక్, పులిశేఖర్, వేణుగోపాల్, మద్దికెర ఎస్సై హరిత, డిప్యూటీ ఎంపీడీవో విజయభాను, సిబ్బంది పాల్గొన్నారు.

రమణీయంగా రథోత్సవం.. మురిసిన భక్తజనం

రథోత్సవంలో మంత్రాలయం తెదేపా బాధ్యుడు రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి ఉత్తరారాధన కార్యక్రమం సందర్భంగా సోమవారం మహారథోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లక్షలాది భక్తులు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. మంత్రాలయం తెదేపా బాధ్యుడు రాఘవేంద్ర రెడ్డి, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తిక్కారెడ్డి తదితరులు రథోత్సవం పాల్గొన్నారు.

ఉత్సవంలో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తిక్కారెడ్డి

అలంకరణలో నీలకంఠేశ్వర స్వామి

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని నీలకంఠేశ్వరస్వామి, లక్ష్మీవేంకటేశ్వరస్వామి తదితర ఆలయాల్లో శ్రావణమాసం మూడో సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలను అర్చకులు చేశారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కోసిగి, న్యూస్‌టుడే: కోసిగిలో వెలసిన మార్కండేయస్వామి రథోత్సవం భక్తిశ్రద్ధలతో సోమవారం జరిగింది. ఏటా శ్రావణ మాసం మూడో సోమవారం పురష్కరించుకొని మార్కండేయస్వామి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శివపార్వతి, మార్కండేయ స్వాముల ఉత్సవ విగ్రహాలను రథోత్సవంపై కొలువుంచి మేళతాళల మధ్య ఊరేగించారు. భక్తులు చేసిన శివ నామస్మరణలతో ఊరేగింపు హోరెత్తింది. కార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు పాల్గొన్నారు.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వర్కూరులో వెలసిన వెంకటప్ప స్వామికి రెండు రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాదయాత్రన తుంగభద్ర నదికి స్వామి విగ్రహానికి ఊరేగింపుగా తీసుకెళ్లిన భక్తులు సోమవారం తిరిగి గ్రామానికి చేరుకున్నారు. మూడో సోమవారం స్వామిని నదికి తీసుకెళ్లి పూజలు చేయటం ఆనవాయితీగా వస్తుందని భక్తులు తెలిపారు.

కొత్తకోట (సి.బెళగల్), న్యూస్‌టుడే: కొత్తకోటలో రాఘవేంద్ర స్వామి ఉత్సవాల్లో భాగంగా పురోహితుడు నారాయణ స్వామి ఆధ్వర్యంలో బృందావనంలో స్వామికి ఉత్తరారాధన పూజలు జరిపారు. భక్తులు ఊరేగింపు నిర్వహించారు.

కోసిగిలో మార్కండేయస్వామి రథోత్సవం..

ఈరన్న స్వామిని దర్శించుకున్న జిల్లా ఎస్పీ

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్య క్షేత్రం ఉరుకుంద నరసింహ ఈరన్న స్వామిని సోమవారం జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ దర్శించుకున్నారు. ఆయనికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారికి విశేష పూజలను నిర్వహించారు. అనంతరం ఎస్పీకి స్వామివారి శేషవస్త్రం, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఉరుకుంద: ఈరన్న స్వామిని దర్శించుకుని బయటకు వస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

33 మంది అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల స్థానంలో ప్రభుత్వం అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్స్‌ను నియమించిందని ఎమ్మిగనూరు ఎంఈఓ-2 మధుసూదన్‌రాజు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మిగనూరు మండలానికి ఎస్‌జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు మొత్తం 33 మందిని నియమించిందన్నారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి విధులకు హాజరు కావాలన్నారు. విద్యాభివృద్ధి కోసం కొత్తగా ఎంపికైన వారు కృషి చేయాలని కోరారు.

ఆ మృతదేహం కర్ణాటక వ్యక్తిది!

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణ శివారు కొండ ప్రాంతంలో ఆగస్టు 27న గుర్తుతెలియని ఓ వృద్ధుడి మృతదేహాన్ని ఆదోని మూడో పట్టణ పోలీసులు గుర్తించారు. ఈ మేరకు దర్యాప్తు ప్రారంభించగా మృతుడు కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా జవాల్‌గేరలోని శ్రీనివాస క్యాంపునకు చెందిన శరణప్ప(73) అని గుర్తించారు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు..శరణప్పకు భార్య శంకరమ్మ, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె సంతానం. ఆయనది గ్రామంలో కిరాణా వ్యాపారం. ఇటీవల ఆయన తరచూ అనారోగ్యానికి గురవుతుండటంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు 27న ఆదోని పట్టణ శివారు రణమండల కొండ ప్రాంతానికి వచ్చి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు సోమవారం స్టేషన్‌కు వచ్చి ఈ మేరకు ఫిర్యాదు చేశారు.

వృద్ధుడి ఆచూకీ కోసం గాలింపు

చిప్పగిరి, న్యూస్‌టుడే: హంద్రీ కాలువలో గల్లంతైన వృద్ధుడి ఆచూకీ కోసం బంధువులు, పోలీసులు గాలిస్తున్నారు. ఆదివారం హంద్రీ కాలువలో దూకి చిప్పగిరి మండలం, బెల్డోణ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు సోమలింగమ్మ (60), సీతన్న (64) ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. సోమలింగమ్మ మృతదేహం లభించగా శవపరీక్ష చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సీతన్న ఆచూకీ లభించకపోవడంతో గాలింపు కొనసాగించారు.

ఏపీకి నీటి వాటా ఇవ్వాలి

ఎస్ఈ నారాయణ నాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న టిప్పుసుల్తాన్

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: ఏపీకి రావాల్సి ఎల్లెల్సీ నీటిని ఇవ్వాలని తుంగభద్ర ప్రాజెక్టు ఛైర్మన్ టిప్పుసుల్తాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నీటి పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని తుంగభద్ర బోర్డు శ్రీనివాసులు, ఎస్ఈ నారాయణనాయక్‌లకు వినతిపత్రం ఇచ్చారు. ఛైర్మన్ మాట్లాడుతూ.. మంత్రి నిమ్మలరామానాయుడు ఆదేశాలతో ఏపీకి ఆగస్టు 22వ తేదీ నుంచి ఏపీ సరిహద్దుకు 580 క్యూసెక్కుల నీటిని, బోర్డు పరిమితికి అదనంగా మరో 90 క్యూసెక్కులు విడుదల చేయాలని నిర్ణయించారన్నారు. పదిరోజులు గడిచినా ఏపీ సరిహద్దులో 670 క్యూసెక్కుల నీరు అందాల్సి ఉండగా కేవలం 220 క్యూసెక్కుల నీరు మాత్రమే చేరుతోంది. సుమారు 450 క్యూసెక్కుల నీరు కొరత ఉంటుందన్నారు. ఏపీ సరిహద్దుకు నీరు రాకుండా కర్ణాటక రైతులే నీటిని వాడుకుంటున్నారన్నారు. నీటిని ఇవ్వలేని పక్షంలో బోర్డువారు ఏపీ రైతులకు తగిన పరిహారం చెల్లించాల్సిన అవసరం ఉంటుందన్నారు.

కరవు మండలంగా ప్రకటించండి

సాంబగల్, నెట్టెకల్(ఆదోని గ్రామీణం), న్యూస్‌టుడే: ఎల్‌నినో ప్రభావంతో పంటలు పూర్తిగా దెబ్బతినడంతో ఆదోని మండలం 1, 2లను కరవు మండలాలుగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదోని మండలం నెట్టెకల్, సాంబగల్ గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను సోమవారం రైతు సంఘం నాయకులు పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, కరవు మండలంగా ప్రకటించి ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి అయ్యప్ప, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లింగన్న, నాయకులు హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులనే విక్రయించాలి

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులకు నాణ్యమైన ఎరువులనే విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి రవిప్రకాశ్ సూచించారు. శ్రీవెంకటేశ్వర ఎరువుల దుకాణాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, రశీదులు తదితరాలను పరిశీలించారు. అనంతరం 5 రకాల రసాయన ఎరువులను అమరావతిలో పరీక్షలు చేసేందుకు పంపుతున్నట్లు అధికారి తెలిపారు. ఎరువులను కోనే రైతులకు రశీదులను అందజేయాలన్నారు. నిల్వలను, ధరలను బోర్డుపై రైతులకు కనిపించేలా ఉంచాలన్నారు.

ఎరువులను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి

సాగునీరు అందక.. పంటలు పండక

◆ ఆందోళనలో గోనెగండ్ల ఆయకట్టు రైతులు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గోనెగండ్ల మండలంలో దిగువ కాలువ కింద ఖరీఫ్, రబీ కింద 8 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఖరీఫ్ కింద దాదాపు 2,500 ఎకరాల్లో వేరుసెనగ, పత్తి, మిరప పంటలు అన్నదాతలు సాగు చేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సమయానికి కురవకపోవడంతో ఖరీఫ్ రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీనికి తోడు దిగువ కాలువకు సాగునీటి సరఫరా నిలిచిపోయింది. వర్షాభావం నేపథ్యంలో తుంగభద్ర దిగువ కాలువల కింద సాగు చేసిన పంటలు అన్ని ఎండి పోయాయి. కాలువకు నీటి విడుదల చేయాలని కార్యాలయం వద్ద ఎల్ఎల్‌సీ అధికారులను కర్షకులు వేడుకున్నారు. అనంతరం ఏఈ పరమేశ్‌కు వినతిపత్రం సమర్పించారు. సాగు చేసిన పంటలకు నీరు అందించి ఆదుకోవాలని కోరారు. సాగునీటి సమాచారం కోసం రైతులు ఎల్ఎల్‌సీ కార్యాలయ అధికారి చుట్టూ నిత్యం తిరుగుతున్నారు. ఎండుతున్న పంటలను చూసి జీర్ణించుకోలేక వారు ఆందోళన చెందుతున్నారు.

ఆయకట్టు వివరాలు ఇలా..

మండలం ఆయకట్టు : 8వేల ఎకరాలు
ప్రధాన డిస్ట్రిబ్యూటర్లు : డీపీ 86, పీడీ, ఎంఎల్ఎస్‌పీ
ఖరీఫ్‌లో ఆయకట్టు : 2500 ఎకరాలు
రబీలో : 1600 ఎకరాలు

ఎల్ఎల్‌సీ కాల్వకు నిలిచిపోయిన నీటిసరఫరా

వారబందీ పద్ధతిలో నీటి విడుదల చేయాలి

- బతకన్న, మునిస్వామి, గోనెగండ్ల

ఐదు ఎకరాల్లో పత్తి..మిరప సాగు చేశాం. పంటకు రూ.లక్షల్లో ఖర్చులు పెట్టాం. పంటలు ఎదుగుదల దశలో ఉన్నాయి. సాగునీటి కొరతతో దిగుబడి పూర్తిగా దెబ్బతింది. చేతినిండా అప్పులే మిగిలాయి. వారబందీ ప్రకారం పది రోజులకొకసారి గోనెగండ్ల సెక్షన్‌కు నీటి విడుదల చేయాలి. ఈ పద్ధతి ప్రకారమైనా సాగు నీరు అందే అవకాశం ఉంది.

సాగు చేసిన పంటలకైనా నీరివ్వాలి

- ముస్తాఫ్ సుల్తాన్, గోనెగండ్ల రైతు

నాకు ఎల్ఎల్‌సీ పంట కాల్వ కింద పది ఎకరాల ఆయకట్టు పొలం ఉంది. 20 ఏళ్లుగా సాగునీరు సక్రమంగా అందకపోవడంతో అప్పులు చేసి పొలంలో నాలుగు బోరు బావులు తవ్వించి పంటలు సాగు చేసుకొంటున్నా. ఈ ఏడాది ఖరీఫ్‌లో వేరుశెనగ, పత్తి, మిరప పంటలు సాగు చేశా. 60 రోజులుగా వర్షాలు లేనందున బోర్లు అడుగంటి పోయాయి. పంటలు ఎండి దెబ్బతింటున్నాయి. పంట కాల్వకు నీటి విడుదల జరగడంతో సంతోషించాం. ఒక రోజు, రెండు రోజులు నీళ్లు పారించి నిలిపివేస్తున్నారు. పంటలు చేతికి వచ్చే పరిస్థితులు కన్పించడం లేదు. చేతినిండా అప్పులే మిగిలే పరిస్థితులు కన్పిస్తున్నాయి. సాగు చేసిన పంటలకైనా సాగునీరు ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

పదవీ విరమణ ప్రతి ఉద్యోగికీ సర్వసాధారణం

సి.బెళగల్, న్యూస్‌టుడే: పదవీ విరమణ ప్రతి ఉద్యోగికీ సర్వసాధారణమని ఏపీఆర్ఎస్‌ఏ గిరికుమార్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన సి.బెళగల్‌లో నిర్వహించిన వీఆర్వో శ్రీనివాసులు పదవీవిరమణ సన్మానం సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్సై వేణుగోపాల్ రాజ్, ఎమ్మిగనూరు డిప్యూటీ తహసీల్దారు ధనుంజయ రెడ్డి, సి.బెళగల్ ఉప తహసీల్దారు పురుషోత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని జాలవాడి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయురాలు విక్టోరియమ్మను సోమవారం తోటి ఉపాధ్యాయులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విక్టోరియమ్మ మాట్లాడుతూ.. 31 సంవత్సరాల ఉద్యోగ జీవితం తనకెంతో తృప్తినిచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రామ్మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.లక్షలతో నిర్మించారు.. లక్షణంగా వదిలేశారు

భవనాల ఎదుట ముళ్ల చెట్లు ఇలా..

కోసిగి, న్యూస్‌టుడే: కోసిగి మండల కేంద్రం సజ్జలగూడెం గ్రామానికి వెళ్లే సమీపంలో ఎన్టీఆర్ కాలనీలో గత ప్రభుత్వం నూతనంగా సచివాలయాన్ని రూ.50 లక్షలు, రైతు భరోసా కేంద్రాన్ని రూ.48 లక్షలతో భవనాల పనులు పూర్తి చేసి ఎంతో ఆర్భాటంగా ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకు సచివాలయం, రైతు భరోసా కేంద్రం సిబ్బంది ఈ కార్యాలయాలకు రావడానికి ఆసక్తి చూపడం లేదు. కోసిగి నుంచి ఈ కార్యాలయాలకు రావాలంటే రెండు కిలో మీటర్ల దూరం ఉండటంతో సిబ్బంది ఇక్కడి రాకుండా పాత కార్యాలయాల్లోనే పనులు చేస్తున్నారు. ఈ భవనాల నిర్వహన లోపించడంతో కార్యాలయాల చుట్టూ పిచ్చి చెట్లు పెరిగాయి. అంతేకాకుండా సచివాలయం కార్యాలయం తలుపులు పగలగొట్టి లోపల ఏర్పాటు చేసిన 5 ఫ్యాన్లు, ఇతర సామగ్రిని ఆకతాయిలు దొంగిలించినట్లు స్థానికులు తెలిపారు. ఈ భవనాలను మందుబాబులు ఆవాసంగా మార్చుకున్నారు. రూ.లక్షల ప్రజా ధనంతో నిర్మించిన భవనాలను నిరుపయోగంగా వదిలేయడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాలను ఉపయోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

(c) eenadu

కర్నూలు

•కర్నూలు • పాణ్యం

సుందరీకరణకు నష్టం కలిగిస్తే చర్యలు

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగర సుందరీకరణలో భాగంగా చేపట్టిన పనులను పాడుచేస్తే శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు హెచ్చరించారు. స్థానిక రాజ్‌విహార్ ప్రాంతంలో సుందరీకరణలో భాగంగా అభివృద్ధి చేసిన ప్రాంతాల్లో అతికించిన పోస్టర్లను సోమవారం ఆయన గమనించి సిబ్బందితో తొలగింపజేశారు.

చెత్త సేకరణకు విద్యుత్తు వాహనాలు

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఇంటింటి నుంచి తడి, పొడి చెత్త సేకరించేందుకు అవసరమైన 91 ఎలక్ట్రిక్ ఆటోలను సమకూర్చుకునేందుకు కర్నూలు నగరపాలక సంస్థకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ-ఆటోల సరఫరా, ఐదేళ్ల పాటు నిర్వహణకు గాను రూ.41.70 కోట్ల అంచనా వ్యయానికి మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. అతి తక్కువ ధరకు కోట్ చేసిన సంస్థకు ఈ పనులు అప్పగించారు.

సమస్యలకు సత్వర పరిష్కారం

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : పీజీఆర్ఎస్‌లో నగర ప్రజలు ఇచ్చే వినతులను పరిశీలించి వారి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. స్థానిక ఎస్బీఐ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632,
కర్నూలు గ్రామీణం : 85010 05408
ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలక సంస్థ: ?: బళ్లారిచౌరస్తా సమీపంలో రహదారి గుంతలమయంగా మారింది. మరమ్మతులు చేయాలి. - **మహేశ్, కృష్ణారెడ్డినగర్,** ?: నిర్మల్‌నగర్, ఠాగూర్‌నగర్‌లలో దోమల బెడద ఉంది. నియంత్రణకు ఫాగింగ్ చేయించాలి. - **రామాంజనేయులు, ఠాగూర్‌నగర్** ✔: సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతాం. - **నగరపాలక అధికారులు**

డిమాండ్ల సాధనకు ఉద్యమిస్తాం

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రభుత్వం నుంచి ఉద్యోగులకు రావాల్సిన బకాయి డీఏలు, పీఆర్సీ కమిషన్ నియామకం, ఐఆర్ ప్రకటన తదితర న్యాయమైన డిమాండ్ల సాధనకు ఉద్యమబాట పట్టనున్నట్లు ఏపీ జేఏసీ అమరావతి జిల్లా అధ్యక్షుడు వి.గిరికుమార్‌రెడ్డి తెలిపారు. ఏపీ జేఏసీ అమరావతి జిల్లా అధ్యక్షుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డా.సిరిని కలిసి ఉద్యమ కార్యాచరణకు సంబంధించిన నోటీసులు అందజేశారు. 29 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని జిల్లా అధ్యక్షుడు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీఆర్ఎస్ఏ జిల్లా కార్యదర్శి వెంకటరాజు, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు మురళీకృష్ణ నాయుడు, మురారి శంకరప్ప, పంచాయతీరాజ్ అధికారిణి జ్యోత్స్న, ఏపీపీటీడీ (ఆర్టీసీ) మహేష్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం, ఎస్ఎల్‌టీఏ, ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం, ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం, ఏపీ జేఏసీ అమరావతి జిల్లా కార్యదర్శి కృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు సునీల్‌కుమార్, లోకేశ్వరరెడ్డి, జగదీశ్వరరావు, శివపార్వతి, కృష్ణవేణి, దినోజ్ కుమార్, నూర్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

కలెక్టర్ సిరికి నోటీసులు అందజేస్తున్న ఏపీ జేఏసీ అమరావతి జిల్లా నాయకులు

ప్రాణాలు తీస్తున్న ఎత్తుగడ

◆ ఇష్టానుసారం వేగ నిరోధకాల ఏర్పాటు ◆ ప్రమాదాల బారినపడుతున్న వాహనదారులు

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే : కర్నూలు నగరంలోని ప్రధాన రహదారులపై వాహనాల వేగాన్ని నియంత్రించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన వేగ నిరోధకాలు.. ప్రజల ప్రాణాలు తీస్తున్నాయి. వీధిరోడ్ల నుంచి ప్రధాన రహదారుల వరకు అడుగడుగునా స్పీడ్ బ్రేకర్లు దర్శనమిస్తున్నాయి. వీటిని శాస్త్రీయంగా ఏర్పాటు చేయడంతో పాటు.. సూచిక బోర్డులు ప్రదర్శించాల్సి ఉంది. నగరంలో మాత్రం ఇవేవీ పాటించకుండా ఎక్కువ ఎత్తుతో ఇష్టానుసారం వీటిని ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వాహనదారులు అదుపుతప్పి కింద పడిపోయి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికే పలువురు ప్రాణాలు కోల్పోవడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

ఇటీవల కోడుమూరు రోడ్డులోని వేగనిరోధకం వద్ద జరిగిన ప్రమాదం

ప్రమాదాలన్నీ రాత్రిపూటే..

తారు, కంకరతో నిర్మించిన స్పీడ్ బ్రేకర్లు ఉండే చోట వీధిదీపాలు లేకపోవడంతో రాత్రి సమయాల్లో అవి వాహనదారులకు కనిపించడం లేదు. దీంతో వేగంగా ప్రయాణించే వాహనదారులు వీటిపై వెళ్లినప్పుడు అదుపు తప్పి పడిపోతున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు ఇతర చిన్న వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. ద్విచక్ర వాహనచోదకులు, ఆటోల్లోని ప్రయాణికులు కిందపడిన సందర్భాల్లో తలకు గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందుతున్నారు.

నిబంధనలు గాలికి..

నగర రహదారులపై నిత్యం మూడున్నర లక్షలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వీటిలో 2 లక్షలపైనే ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. 25 వేలకు పైగా ఆటోలు తిరుగుతున్నాయి. ప్రధాన రహదారులు, కూడళ్లు, స్కూల్ జోన్లు, క్రాసింగుల వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్‌బ్రేకర్లు వేశారు. వీటిని నిర్దిష్ట ప్రమాణాల ప్రకారం శాస్త్రీయంగా ఏర్పాటు చేశారు. నగరంలో మాత్రం నిబంధనలు పాటించకుండా తారు, కంకర మిశ్రమంతో, సిమెంటు కాంక్రీటుతో ఎక్కువ ఎత్తు, వెడల్పుతో రహదారులపై అడ్డు గోడల్లా నిర్మించారు.

◆ చాలా ప్రాంతాల్లో ప్రభుత్వ శాఖల అనుమతి లేకుండా ఆయా కాలనీల వాసులే కాంక్రీటు మిశ్రమంతో వేగ నిరోధకాలు నిర్మిస్తున్నారు. మరికొన్ని చోట్ల దారికి అడ్డంగా గుంతలు తవ్వుతున్నారు.

◆ స్పీడ్ బ్రేకర్లు ఉన్నట్లు వాహనదారులకు తెలియజేసేందుకు అక్కడ సూచిక బోర్డులు ప్రదర్శించాలి. వాటిపై తెల్లని రంగు వేయాలి. రాత్రి సమయాల్లో కనిపించేలా రేడియం స్టిక్కర్లు అతికించాలి. ఎక్కడా వీటిని ఏర్పాటు చేయడం లేదు.

అదుపుతప్పి పడి'పోతున్నారు'

◆ ఈ ఏడాది మే నెలలో బేతంచెర్లకు చెందిన షేక్ షావలి తన స్నేహితుడిని కలిసేందుకు కర్నూలుకు వచ్చారు. ఇద్దరూ కలిసి అర్ధరాత్రి దాటిన తర్వాత నంద్యాల చెక్‌పోస్టువైపు నుంచి సి.క్యాంపు వైపు వెళ్తున్నారు. మాధవీనగర్ వద్ద కనిపించని స్పీడ్‌బ్రేకర్లపై వేగంతో వెళ్లటంతో అదుపుతప్పి పడిపోయారు. ప్రమాదంలో షేక్ షావలి ప్రాణాలు కోల్పోగా అతని స్నేహితుడు గాయపడ్డారు.

◆ గూడూరుకు చెందిన ఓ వ్యక్తి ఆగస్టు 28న కర్నూలులో ఓ వివాహ వేడుకకు హాజరయ్యారు. తన స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయల్దేరారు. నగర శివారులోని కోడుమూరు రోడ్డులో వేగ నిరోధకంపై వెళ్లడంతో వెనుక కూర్చున్న వ్యక్తి ఎగిరి కిందపడ్డారు. వెనుక వస్తున్న ట్రాక్టర్ టైరు ఆయన తలపై వెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఇవి కాకుండా నిత్యం ఎందరో గాయాలతో ఆసుపత్రుల పాలవుతున్నారు.

◆ వేగ నిరోధకాలపై ప్రయాణించడం వల్ల చాలామంది వెన్నెముక, మెడ, డిస్కుల సమస్యల బారినపడుతున్నారు.

ఫ్యాప్టో ధర్నా తాత్కాలికంగా వాయిదా

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఈనెల 1న నిర్వహించ తలపెట్టిన ఫ్యాప్టో ధర్నాను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు రాష్ట్ర ఫ్యాప్టో కోఛైర్మన్ ప్రకాశ్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీసీఈబీ సెక్రటరీ నియామకం విషయంలో ఎస్ఈఆర్‌టీ డైరెక్టర్‌కు ఆదేశాల కోసం డీఈవో సుధాకర్ లేఖ రాయడంతో ధర్నాను వాయిదా వేసినట్లు వెల్లడించారు.

నగరానికి కొత్త శోభ తీసుకొద్దాం

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరంలోని కూడళ్లను అభివృద్ధి చేసి పచ్చదనం పెంచడం ద్వారా కర్నూలుకు కొత్త శోభ తీసుకొద్దామని నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు పేర్కొన్నారు. స్థానిక కోట్ల విజయభాస్కర్‌రెడ్డి సర్కిల్, కిడ్స్ వరల్డ్, రాజ్‌విహార్, మౌర్యఇన్ తదితర ప్రాంతాల్లోని కూడళ్లు, విభాగినులను సోమవారం ఆయన పరిశీలించారు. ప్రధాన రహదారుల వెంట ఉన్న విభాగినులకు మరమ్మతులు, ఆకర్షణీయమైన రంగులు వేయడం, పాదబాటలను అభివృద్ధి చేయడం వంటి పనులను ప్రణాళికబద్ధంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, ఎంఈ మనోహర్‌రెడ్డి, ఉద్యానవన విభాగం ఏడీ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు సూచనలిస్తున్న నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు

పశువుల సంత కాదు.. కూరగాయల మార్కెట్టే

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌యార్డులోని కూరగాయల మార్కెట్ పశువుల సంతను తలపిస్తోంది. మార్కెట్ ఆవరణలో కూరగాయల వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోయాయి. వాటిని తినేందుకు నిత్యం వందలాది పశువులు వస్తున్నాయి. వాటి సంచారంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో మనుషులపై దాడులు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయల సంతలోకి పశువులు ప్రవేశించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు.
– న్యూస్‌టుడే, కర్నూలు మార్కెట్

దారి ఛిద్రం.. ప్రయాణం నరకప్రాయం

కర్నూలు సబ్ రిజిస్ట్రారు కార్యాలయం సమీపంలో సర్వీసు రహదారి ఛిద్రమైంది. అడుగడుగునా గుంతలు తేలి ప్రమాదకరంగా మారింది. రద్దీ ప్రాంతం కావడంతో ఇక్కడ వాహనదారులు తరచూ ప్రమాదాల బారినపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గుంతలు పూడ్చివేయించి రహదారికి మరమ్మతులు చేయించాలని వాహనచోదకులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, కర్నూలు నగరపాలక సంస్థ

రద్దీ కూడలి.. రాకపోకలు చక్కదిద్దాలి

కల్లూరు చెన్నమ్మ కూడలిలో తీవ్ర రద్దీతో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ఈ కూడలిలో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఇక్కడ ట్రాఫిక్ సిగ్నల్స్ కూడా లేవు. నాలుగు వైపుల నుంచి వాహనాలు ఒకేసారి వెళ్తుండటంతో ఎవరెటు వెళ్తున్నారో తెలియని గందరగోళ పరిస్థితులు తలెత్తుతున్నాయి. పాత ఈద్గా వద్ద రైల్వే వంతెన పనుల కారణంగా ఆర్టీసీ బస్సులన్నీ చెన్నమ్మ కూడలి మీదుగానే రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ఇక్కడ ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమైంది. పోలీసులు స్పందించి ఇక్కడ ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు మార్కెట్

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కర్నూలు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే : శ్రావణ సోమవారం, సంకటహర చతుర్థిని పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. గణపతి విగ్రహాలను గరిక, వివిధ రకాల పుష్పాలతో అలంకరించి పూజలు, వ్రతాలు నిర్వహించారు. సూర్యనారాయణస్వామి ఆలయం, అయ్యప్ప గుడి, గణేశ్‌నగర్ అమృతేశ్వర కోవెల, గోశాల, గోదాగోకులం తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

KIMS HOSPITALS™
KURNOOL
MEDICAL & HEALTH
AP State Govt. Medical Reimbursement Facility Available at
KIMS Hospital, Kurnool
69/213-K-9, Joharapuram,
Joharapuram Road, Kurnool - 518002.
Contact: 085183 52000

సంక్షిప్త సమాచారం

ఉప ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు రేపు : కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ జన్మదినం సందర్భంగా సెప్టెంబరు 2న పార్టీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నేత చింతా సురేష్‌బాబు సోమవారం తెలిపారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి : కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : విద్యార్థులు సాంకేతిక అంశాల్లో నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఉద్యోగ సాధన సులభం అవుతుందని కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత డా.కె.వి.సుబ్బారెడ్డి సూచించారు. దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

తెలుగు ఔన్నత్యాన్ని చాటాలి : కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : తెలుగుభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఇందిరాగాంధీ స్మారక నగరపాలక ఉన్నత పాఠశాలలో 'వంద పద్యాలు.. వంద మంది విద్యార్థులు' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. అవధానం సుధాకర్‌శర్మ మాట్లాడుతూ విద్యార్థులు తెలుగుభాష ఔన్నత్యాన్ని చాటాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలు రోజా పాల్గొన్నారు.

విరూపాక్షిని కలిసిన మాజీ ఎమ్మెల్యేలు : కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : రిమాండ్‌పై కర్నూలు మండలం పంచలింగాలలోని జిల్లా కారాగారంలో ఉన్న ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిని సోమవారం వైకాపా జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, అనంతపురం జిల్లా రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి కలిశారు.

లొద్దిపల్లెలో ఇరువర్గాల ఘర్షణ : ఓర్వకల్లు, న్యూస్‌టుడే : మండలంలోని లొద్దిపల్లెలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండు

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : వైద్యారోగ్యశాఖలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్టు ఎంప్లాయిస్ జేఏసీ అధ్యక్షురాలు శ్రీదేవి డిమాండ్ చేశారు. ఒప్పంద ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ సోమవారం సర్వజన వైద్యశాల నుంచి రాజ్‌విహార్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేంద్రబాబు, నాయకురాళ్లు హేమలత, లలిత, పుష్ప, కేసమ్మ పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న ఒప్పంద ఉద్యోగులు

ఫుట్‌బాల్ పోటీల విజేత బి.క్యాంపు క్లబ్

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : స్థానిక సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల సమీపంలోని 24 ఏరినాలో సోమవారం కర్నూలు లీగ్ 7ఏ సైడ్ అండర్-19 ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. 14 జట్లు పోటీపడ్డాయి. తుది పోరులో బి.క్యాంపు ఫుట్‌బాల్ క్లబ్ జట్టు ఫ్రెండ్స్ క్లబ్‌పై 2- 1 గోల్స్ తేడాతో గెలిచి ట్రోఫీ, రూ.3 వేల నగదు ప్రోత్సాహం అందుకుంది. బహుమతుల ప్రదానోత్సవంలో వ్యాయామ ఉపాధ్యాయుడు పాల్‌విజయ్‌కుమార్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్ పాల్గొన్నారు.

'అవగాహన లేకుండా మాట్లాడొద్దు'

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : గోరుకల్లు రిజర్వాయర్‌పై తెదేపా నాయకులు అవగాహన లేకుండా మాట్లాడొద్దని వైకాపా నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హితవుపలికారు. కల్లూరులో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2020 నుంచి 2024 వరకు జలాశయం కట్ట కుంగిపోయిన సమయంలో గ్రీన్‌కో కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి మరమ్మతులు చేయించి, సుమారు 11 టీఎంసీల నీటిని నిల్వ చేసి రైతులకు నీరు అందించిన ఘనత తమదన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, మాజీ మేయర్ బీవై రామయ్య పాల్గొన్నారు.

ఈవీఎంల భద్రతలో నిర్లక్ష్యం తగదు

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని కలెక్టర్ డా.సిరి పేర్కొన్నారు. కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలోని ఈవీఎంల గోదామును కలెక్టర్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరంతరం పటిష్ఠమైన నిఘా ఉండాలన్నారు. ఈవీఎంలకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లు, సీసీ టీవీ పర్యవేక్షణ, ఎంట్రీ, ఎగ్జిట్ రిజిస్టర్ నిర్వహణకు సంబంధించి ఎన్నికల విభాగం, భద్రతా సిబ్బందికి కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : గత సార్వత్రిక ఎన్నికల్లో గుత్తేదారులు చేసిన పనులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని కర్నూలు నగరపాలక గుత్తేదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం.మనోహర్‌రెడ్డి కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వారు అధికారులకు వినతిపత్రం అందజేశారు. రూ.2 కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ఎన్నికల బిల్లులను తమవద్దే పెట్టుకొని కలెక్టరేట్‌లో ఉన్నాయని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మహమ్మద్ షరీఫ్, గుత్తేదారులు పాల్గొన్నారు.

అమరావతి ఛాంపియన్‌షిప్‌లో జిల్లాకు పతకాలు

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : తిరుపతిలో ఆగస్టు 24 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీల్లో కర్నూలు జిల్లాకు చెందిన క్రీడాకారులు పతకాలు సాధించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం వారు కలెక్టర్ డా.సిరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కలెక్టర్ వారిని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. 800 మీటర్ల పరుగులో రామాంజనేయులు స్వర్ణం, మనీష్ అశ్వినీకుమార్‌నాయుడు రజతం, 100 మీటర్ల పరుగు, హైజంప్‌లో కె.మంజు కాంస్య పతకాలు అందుకున్నారు. వెయిట్ లిఫ్టింగ్‌లో డి.జి.వీరేశ్ స్వర్ణం, పర్వేజ్ రజతం, అబ్దుల్‌హక్ కాంస్యం, షేక్ అఫ్రీద్ స్వర్ణం, షేక్ సాద్‌బాషా, షేక్ జైద్‌బాషా రజత పతకాలు కైవసం చేసుకున్నట్లు డీఎస్‌డీవో భూపతిరావు, వెయిట్‌లిఫ్టింగ్ కోచ్ యూసుఫ్‌బాషా, అథ్లెటిక్స్ కోచ్ కాశిరావు తెలిపారు.

క్రీడాకారులను అభినందించిన కలెక్టర్ డా.సిరి

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S.No.13/2021
1) Dr. పగిడి శివారెడ్డి
2) పగిడి సుధాకర్ రెడ్డి(Died by Lrs of D3 to D5)
3) పగిడి శంకర్ రెడ్డి ...వాదులు
-V/s-
1) షేక్ మాలిక్ బాష మరియు అదర్స్ ...ప్రతివాదులు
4వ మరియు 5వ ప్రతివాదులకు దావా సమన్లు
D4. పి.నాగమణి D/o లేటు పగిడి సుధాకర్ రెడ్డి
D5. మంద్ర రజిత D/o లేటు పగిడి సుధాకర్ రెడ్డి ఆల్ ఆర్ R/o గార్గేయపురము గ్రామం, కర్నూలు మండలం, కర్నూలు జిల్లా.
పై నంబర్ గల దావాలో రెండవ వాది అయిన పగిడి సుధాకర్ రెడ్డి చనిపోయినందున అతనికి అర్జీలో కనబరచిన 4వ మరియు 5వ ప్రతివాదులకు వారసులుగా చేర్చమని అర్జీదారులు అర్జీ దాఖలు చేసినారు. ఇందులో 4వ మరియు 5వ ప్రతివాదులు అయిన మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 07-09-2026 పగలు 10.30 గంటలకు పై కోర్టులో హాజరై మీరు తెలుపుకోవలయును. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.
కోర్టువారి ఉత్తర్వుల మేరకు
తేది: 07-09-2026
జి.మధుసూధన రెడ్డి
వాదులు అర్జీదారుల పరం అడ్వకేటు, కర్నూలు.
సెల్ నెం: 94402 91373

బాధలు చూడండి.. భరోసా ఇవ్వండి

◆ పీజీఆర్ఎస్‌లో దివ్యాంగుల వేడుకోలు

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : శారీరక వైకల్యంతో బాధపడుతున్న వారు.. ప్రమాదాల్లో గాయపడి.. అనారోగ్య సమస్యలతో మంచానికే పరిమితమైన వారు దివ్యాంగుల పింఛను అందించి ఆదుకోవాలని అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గతంలో వస్తున్న పింఛను సాయాన్ని కూడా గత ప్రభుత్వంలో రాజకీయ కారణాలతో ఆపేశారని మరికొందరు వాపోతున్నారు. పేదరికం కారణంగా కుటుంబ పోషణ భారంగా మారిందని.. తమకు చేయూతనిచ్చి సమస్యల నుంచి గట్టెక్కించాలని ప్రతివారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రాలు ఇస్తున్నారు. ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు కనికరించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండున్నరేళ్లుగా మంచానికే పరిమితం

చక్రాలకుర్చీలో కూర్చున్న ఈయన పేరు పసుల రాముడు. కల్లూరు మండలం కె.మార్కాపురం వీరి గ్రామం. రెండున్నర సంవత్సరాల కిందట రోడ్డు ప్రమాదంలో ఎడమకాలికి తీవ్ర గాయాలయ్యాయి. నాలుగు చోట్ల ఆపరేషన్ చేశారు. ప్రమాదం జరిగినప్పటి నుంచి నడవలేక.. కూర్చోలేక మంచానికే పరిమితమైన ఈయనకు 43 శాతం మాత్రమే వైకల్యం ఉన్నట్లు వైద్యులు సదరం ధ్రువపత్రం మంజూరు చేశారని కుటుంబ సభ్యులు వాపోతున్నారు. వైద్యులు మరోసారి పరీక్షించి వందశాతం వైకల్యం ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలంటూ సోమవారం కలెక్టరేట్‌లో జేసీని కలిసి విన్నవించారు. నెలకు రూ.15 వేల ఆరోగ్య పింఛను మంజూరు చేయించి వైద్య ఖర్చులకు, కుటుంబ పోషణకు చేయూతనివ్వాలని కోరారు.

తెదేపా వారని పింఛను ఆపేశారు

కల్లూరు మండలం మార్కాపురం గ్రామానికి చెందిన ఇతని పేరు ఆర్.మధు. మానసిక దివ్యాంగుడైన ఇతను నాలుకపై, చెవుల్లో పుండ్లు ఏర్పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుకపై పుండ్ల వల్ల కారం ఉన్న ఆహారాన్ని తినలేరు. ఇతనికి 75 శాతం వైకల్యం ఉన్నట్లు సదరం ధ్రువపత్రం మంజూరు చేశారు. నెలకు రూ.120 ఇస్తున్నప్పటి నుంచి ఇతను దివ్యాంగుల పింఛను తీసుకుంటున్నారని.. గత వైకాపా ప్రభుత్వంలో తెదేపాకు చెందిన వారని తొలగించారని కుటుంబ సభ్యులు వాపోతున్నారు. పింఛను పునరుద్ధరించాలని రెండేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నామని.. కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్‌లో ఇప్పటికే ఆరుసార్లు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదంటున్నారు.

90 శాతం వైకల్యం ఉన్నా జాలిచూపరు

ఈ బాలుడి పేరు అమర్‌నాథ్. వయసు 13 ఏళ్లు. 8వ తరగతి చదువుతున్నాడు. వెల్దుర్తి మండలం కోసనపల్లి గ్రామానికి చెందిన ఈ బాలుడికి పుట్టుకతోనే మాటలు రావు. గత ప్రభుత్వంలో 2023లో వైద్యులు పరీక్షించి 90 శాతం వైకల్యం ఉన్నట్లు నిర్ధారిస్తూ సదరం ధ్రువీకరణ పత్రం జారీ చేశారు. అప్పటి నుంచి దివ్యాంగుల పింఛను మంజూరు చేయాలని సచివాలయం, వెల్దుర్తి ఎంపీడీవో కార్యాలయం, కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని తల్లి లక్ష్మీదేవి వాపోతున్నారు. ఇప్పటి వరకు పదిసార్లు వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేదని, మా కుమారుడికి దివ్యాంగుల పింఛను మంజూరు చేసి న్యాయం చేయాలని కోరుతున్నారు.

అధికారుల సహకారం మరువలేనిది

కర్నూలు జడ్పీ, న్యూస్‌టుడే : కర్నూలు జిల్లాలో పని చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందని, జిల్లా యంత్రాంగం, అధికారులు అందించిన సహకారం మరువలేనిదని పంచాయతీరాజ్ ఎస్ఈ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఎస్ఈకి స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం పీఆర్ ఇంజినీర్ల సంఘం ఆధ్వర్యంలో సన్మాన సభ నిర్వహించారు. జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి, అనంతపురం ఎస్ఈ సుబ్బరాయుడు, ఈఈ శివసాగర్ రెడ్డి, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆర్.సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ధనిబాబు, డీఈఈలు కర్రెన్న, నాగరాజు తదితరులు ఎస్ఈ దంపతులను సత్కరించారు.

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ ఎస్సై పీఎం అలీఖాన్, పత్తికొండ ఏఎస్సై హెచ్‌పీ ఫక్రుద్దీన్, కర్నూలు పోలీసు కంట్రోల్‌రూం హెడ్‌కానిస్టేబుల్ తిరుపాలు ఉద్యోగ విరమణ చేశారు. ఈసందర్భంగా సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఆర్ అదనపు ఎస్పీ కృష్ణమోహన్ వారిని సత్కరించారు. ఆర్ఐ నారాయణ, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

3వ తేదీన నృత్య పోటీలు

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని భారతమాత మాతృమండలి ఆధ్వర్యంలో విద్యార్థులకు నృత్య పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షురాలు ఈ.పద్మావతి తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థినీ విద్యార్థులు 2వ తేదీ బుధవారం సాయంత్రం వెంకటరమణకాలనీలోని వేంకటేశ్వర ఆలయంలో పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. 3వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయన్నారు.

LIC వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు
మా పాలసీదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు మరియు LIC ఏజెంట్లకు, ఆఫీసు సిబ్బందికి LIC 70వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు
LIC లో బీమా చేయండి - జీవితంలో ధీమాగా ఉండండి
యస్.పి.మద్దయ్య, B.Com, B.Ed, Cls
Member of the Chairman's Club for Agents
Vittal Nagar, Kurnool. Cell: 94402 93783.

LIC వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు
మా పాలసీదారులకు, బంధుమిత్రులకు, ఏజెంట్లకు, ఆఫీస్ సిబ్బందికి అందరికీ 70వ LIC వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు
K.సాయిభరత్
DM Club Member
6 Times M.D.RT U.S.A Agent
కర్నూలు బ్రాంచ్ (656)
Cell No: 91213 03289
K.నరసింహుడు
Chairman Club Member
Chief Life Insurance Advisor
M.D.RT U.S.A Agent
కర్నూలు బ్రాంచ్ (656)
Cell No: 99081 48428
గమనిక: LIC ఏజెంట్స్‌గా నియమించబడును. క్రొత్త LIC పాలసీలు చేయబడును, Star Health Insurance చేయబడును.

(c) eenadu